జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | మంగళవారం 14 జనవరి 2025 | సంపుటి : 15 | సంచిక : 288 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




పాఠకులకు
ప్రకటనకర్తలకు
శ్రేయోభిలాషులకు
సంక్రాంతి శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా
నేడు కార్యాలయానికి సెలవు
కావున రేపు (బుధవారం)
సంచిక వెలువడదు
పునర్దర్శనం గురువారం

## నారావారిపల్లె నుంచే అభివృద్ధి

# పనులకు శ్రీకారం

- పండుగ పూటా ప్రజాసేవలోనే
- సంక్రాంతి వేడుకలకు కుటుంబ సమేతంగా సొంతూరుకి సీఎం
- సీసీ రోడ్లు, పాఠశాల భవనాలు, విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సీఎం
- మహిళల స్వయం ఉపాధికి ఈ-ఆటోలు అందజేత
- సొంతూరు నారావారిపల్లె నుంచే పలు అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- సూక్ష్మ సాగునీటి పథకంలో భాగంగా రైతులకు డ్రిప్‌లు, స్ప్రింకర్లు పంపిణీ



కుప్పం


సంక్రాంతి పండుగకు కుటుంబ సమేతంగా స్వగ్రామం నారావారిపల్లె వెళ్లిన సీఎం చంద్రబాబు అక్కడా తీరిక లేకుండా ప్రజాసేవా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. సాధారణ రోజుల్లో పాలన వ్యవహారాల్లో బిజీబిజీగా ఉండే సీఎం చంద్రబాబు పండుగ పూట కూడా ఏమాత్రం విశ్రాంతి లేకుండా గడిపారు. ఉదయం స్థానిక నేతలతో కలిసి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం సొంతగ్రామం నుంచి చంద్రగిరి మండలంలోని వివిధ గ్రామాలకు అవసరమైన రోడ్లు, విద్యుత్ కేంద్రాలు, పాఠశాల భవనాలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాలకు చౌకైన, నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేసేందుకు ఈజీ మార్ట్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. - మిగతా3లో



గతేడాది హతమైన ఉగ్రవాదుల్లో

## 60 శాతం మంది పాకిస్తానీయులే

- ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది
- హింసను ప్రేరేపించేందుకు పాకిస్తాన్ పాత్ర ఏంటో ఈ చర్యతో తెలిసి పోతుంది
- పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లో హింసను ప్రేరేపిస్తున్నారు
- ఈ ఉగ్రవాదుల్లో 80 శాతం మంది పాకిస్తానీలు ఉన్నారు



రైతులకు గుడ్ న్యూస్..

## వచ్చే నెల ఖాతాల్లోకి రూ.10 వేలు

- ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద వార్షికంగా వచ్చే మొత్తం పెరుగుతుందని అంచనా
- పలు వర్గాల సమాచారం ప్రకారం రైతులకు చెల్లించే వార్షిక మొత్తం రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెరుగుతుంది
- బడ్జెట్ మొదటి రోజు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.



## ప్రారంభమైన మహా కుంభమేళా

- త్రివేణి సంగమం వద్ద తొలి రోజు 50 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు
- ఇది అమెరికా, రష్యా దేశాల జనాభా కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం
- కుంభమేళా ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి జరుగుతుంది
- అయితే ఇప్పుడు జరిగేది మహా కుంభమేళా.

మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన

## వ్యాఖ్యలు హాస్యాస్పదం

- రైతులను నిండా ముంచిన జగన్ ఇప్పుడు మతి చెలించి మాట్లాడుతున్నారు..
- జగన్ పని తీరు, వ్యవహారశైలి నచ్చక అనేక మంది నేతలు ఆ పార్టీని వీడుతున్నారు
- ఫ్యాన్ పార్టీ అధినేత పూర్తిగా నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయాయి
- బిందు సేద్యం, పామాయిల్, మామిడి, ధాన్యానికి మద్దతు ధర వంటి వాటితో అన్నదాతలు సంతోషంగా ఉన్నారు
- రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోంది




విజయవాడ

మూడు నెలల్లో కూటమి ప్రభుత్వం కూలిపోతుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. జగన్ మాటలు వింటుంటే మతి చెలించి మాట్లాడుతున్నారనే అనుమానం కలుగుతోందని మంత్రి మండిపడ్డారు. జగన్ పని తీరు, వ్యవహారశైలి నచ్చక అనేక మంది నేతలు ఆ పార్టీని వీడుతున్నారని, అయినా ఆయన మాత్రం పద్ధతి మార్చుకోవడం లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. - మిగతా3లో

# మోడీ స్కూల్లో టీడీపీ

- సభలో మోదీని ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు నిజమేననిపిస్తుంది
- మీ స్కూల్.. నా స్కూల్ ఒకటేనని చంద్రబాబు అన్నది అభివృద్ధి.. విజన్ గురించి
- అయితే ప్రత్యర్థిని కట్టడి చేయడానికి దూరం చేయడంలో కూడా ఇద్దరి స్కూలు ఒకటే.
- మోదీ మంత్రాంగంతోనే నేడు అనేక రాష్ట్రాల్లో కమలం పార్టీ జెండా ఎగురగలిగింది
- ఏ ఎన్నిక జరిగినా అది బీజేపీ ఖాతాలో పడటం సర్వసాధారణమయింది
- జనాలకు కూడా ఇది పెద్దగా ఆశ్చర్య పోవాల్సిన పనిలేకుండా పోయింది

విశాఖపట్టణం

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సభలో మోదీని ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు నిజమేననిపిస్తుంది. మీ స్కూల్.. నా స్కూల్ ఒకటేనని చంద్రబాబు అన్నది అభివృద్ధి.. విజన్ గురించి. అయితే ప్రత్యర్థిని కట్టడి చేయడానికి దూరం చేయడంలో కూడా ఇద్దరి స్కూలు ఒకటే. మోదీ మంత్రాంగంతోనే నేడు అనేక రాష్ట్రాల్లో కమలం పార్టీ జెండా ఎగురగలిగింది. ఏ ఎన్నిక జరిగినా అది బీజేపీ ఖాతాలో పడటం సర్వసాధారణమయింది. జనాలకు కూడా ఇది పెద్దగా ఆశ్చర్య పోవాల్సిన పనిలేకుండా పోయింది. ఎందుకంటే ముందుగానే బీజేపీ విజయాన్ని అంచనా వేసుకుంటున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అదే సిలబస్ ను పాటిస్తున్నట్లే కనిపిస్తుంది. ప్రత్యర్థులు బలంగా ఉన్న చోట వీక్ చేయడం లక్ష్యం? పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. పైకి ఎవరికీ ఇది అర్థం కాకపోయినా లోతుగా అధ్యయనం చేసే రాజకీయ విశ్లేషకులకు మాత్రం ఇది సులువుగానే అర్థమవుతుంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తిరిగి కూటమి అధికారంలోకి రావాలన్నది - మిగతా3లో




## ఐదుగురు ఐపీఎస్‌ల బదిలీ

విజయవాడ

సంక్రాంతి పండుగ వేళ ఏపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2021-22 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఏపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం నాడు ఉత్వర్వులు జారీ చేసింది. చింతపల్లి ఏఎస్పీగా నవజ్యోతి మిశ్రా, నంద్యాల ఏఎస్పీగా మందా జావళి ఆల్ఫోన్‌కు పోస్టింగ్ ఇస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే,, రాజంపేట ఏఎస్పీగా మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, కాకినాడ ఏఎస్పీగా దేవరాజ్ మనీశ్, తాడిపత్రి ఏఎస్పీగా రోహిత్‌కుమార్ చౌదరిను బదిలీ చేసింది.

# క్రౌడ్ ఫండింగ్‌తో అతిషీ క్యాంపెయిన్

**న్యూఢిల్లీ :** పోలింగ్ గడువు సమీపిస్తుండడంతో దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల వేడి తారాస్థాయికి చేరుకుంటోంది. అన్ని పార్టీలు ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. ప్రధాన పోటీ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ మధ్యే ఉంది. కాంగ్రెస్ కూడా ఒంటరిగా బరిలోకి దిగడంతో త్రిముఖ పోటీ తలెత్తడం ఖాయం. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరుగుతాయని తెలిసిందే. అదే నెల 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ నెల 10న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయబడింది. ఆ రోజు నుంచి నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి ఈ నెల 17 చివరి తేదీ.ఈ పరిస్థితుల మధ్య ముఖ్యమంత్రి అతిషి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ప్రచార ఖర్చుల కోసం ఆమె కొత్త కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చారు. క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులు సేకరించాలని ఆమె నిర్ణయించింది. ఆమె ఈ ఉదయం తన నియోజకవర్గంలో క్రౌడ్ ఫండింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషికి క్రౌడ్ ఫండింగ్ కింద కేవలం 4 గంటల్లోనే 11 లక్షల రూపాయలకు పైగా విరాళాలు అందాయి. 190 మంది అతిషికి రూ.11 లక్షల 2 వేల 606 విరాళంగా ఇచ్చారు. అతిషి ఉదయం 10 గంటలకు క్రౌడ్ ఫండింగ్ కోసం విజ్ఞప్తి చేశారు. కల్కాజీ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అతిషి రూ.40 లక్షల క్రౌడ్ ఫండింగ్ కోసం ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఎన్నికల్లో పోటీ చేయడానికి నాకు డబ్బు అవసరమని అతిషి చెప్పింది. ఎన్నికల్లో పోటీ చేయడానికి నాకు రూ.40 లక్షలు కావాలి. నా క్రౌడ్ ఫండింగ్ ప్రచారానికి మద్దతు ఇవ్వండి. మేము పారిశ్రామికవేత్తల నుండి విరాళాలు తీసుకోబోమని అతిషి చెప్పారు. మేము ప్రజల నుండి వచ్చే విరాళాలతో ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. అతిషి జీబిప్త్రతిబప్త్రతి.జీజీఎజీజీటఎతిజూజీతీబిఎ.నీతీణ అనే లింక్‌ను




విడుదల చేస్తూ.. ఒక నాయకుడు ప్రజా విరాళాలతో ఎన్నికల్లో పోటీ చేస్తే, ఏర్పడిన ప్రభుత్వం అతని కోసం పనిచేస్తుందని, అతను పారిశ్రామికవేత్తల నుండి డబ్బు తీసుకొని పోటీ చేస్తే, అది అతనికి పని చేస్తుందని అన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ ఏర్పడినప్పటి నుండి ఢిల్లీలోని సామాన్య ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతు ఇవ్వడానికి, ఎన్నికల్లో పోటీ చేయడానికి విరాళాలు ఇచ్చారని అతిషి విలేకరుల సమావేశంలో అన్నారు. 2013లో కూడా ప్రజలు ఎన్నికల్లో చిన్న చిన్న విరాళాలు ఇచ్చారు. 2013లో తను మొదటి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఇంటింటికి వెళ్ళానన్నారు. ప్రజలు అప్పుడు 10 రూపాయలు, 50 రూపాయలు, 100 రూపాయల ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నిజాయితీగల రాజకీయాలు పెద్ద వ్యాపారవేత్తల నుండి విరాళాలు తీసుకోకపోవడం వల్లే సాధ్యమయ్యాయని ఆయన అన్నారు. వ్యాపారవేత్తల నుండి డబ్బు తీసుకున్న పార్టీలు, ఆ తర్వాత వారి ప్రభుత్వాలు వ్యాపారవేత్తల కోసం పనిచేస్తాయన్నారు. బిజెపి జాబితాకు సంబంధించి రెండు విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అతిషి అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి బిజెపికి అభ్యర్థి లేరు. లేకపోతే ఎందుకు అంత సమయం తీసుకుంటుంది. బిజెపి సీనియర్ నాయకులు ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా లేరని వినిపిస్తోందన్నారు.

# ప్రారంభమైన మహా కుంభమేళా

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో మహా కుంభమేళా ప్రారంభమైంది. తొలి రోజు ఉదయం గంగా యమునా సరస్వతి నదులు కలిసిన త్రివేణి సంగమం వద్ద దాదాపు 50 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ప్రపంచంలోనే అత్యధిక మంది సమ్మేళనమైన కార్యక్రమంగా ఈ మహా కుంభమేళా రికార్డుల్లోకి ఎక్కనుంది. ఈ కుంభమేళాకు దాదాపుగా 45 కోట్ల మందికిపైగా భక్తులు తరలివస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఇది అమెరికా, రష్యా దేశాల జనాభా కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం. కుంభమేళా ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. అయితే ఇప్పుడు జరిగేది మహా కుంభమేళా. ఈ మహా కుంభమేళా 144 ఏళ్లకు ఒకసారి జరుగుతుంది. ఇవాళ ప్రారంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. ఈ మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్ సర్కారును ఆర్థికంగా ఎంతో బలోపేతం చేయనుంది. ఈ 45 రోజుల మహా కుంభమేళా నిర్వహణ కోసం యూపీ సర్కారు రూ.7 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.అయితే మహా కుంభమేళాకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తే.. యూపీకి ఆదాయం రూపంలో దాదాపు రూ.2 లక్షల కోట్లు వచ్చే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ భక్తులు 45 కోట్ల మంది రాకపోయినా 40 కోట్ల మందే వచ్చినా.. ఒక్కో భక్తుడు రూ.5 వేల చొప్పున ఖర్చు చేసినా రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉన్నదని వారు చెబుతున్నారు. ఇక భక్తులు రూ.10 వేల చొప్పున ఖర్చు చేస్తే మొత్తం రూ.4 లక్షల కోట్ల ఆదాయం సమకూరినా



ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని తెలిపారు.కాగా 2019లో జరిగిన అర్థ కుంభమేళా ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరినట్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ చెప్పారు. ఆ కుంభమేళాకు 24 కోట్ల మంది భక్తులు వచ్చారు. ఐదేళ్ల క్రితం 24 కోట్ల మంది భక్తులు వస్తేనే రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం వచ్చినప్పుడు.. ఈసారి 40 కోట్ల మంది కంటే ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రూ.2 లక్షల కోట్ల ఆదాయం రావడం అసాధ్యమేమీ కాదని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు

**45 రోజుల వేడుక..**

**రూ. 2,00,000 లక్షల కోట్ల బిజినెస్..**

ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఈరోజు (జనవరి 13) నుంచి మహా కుంభమేళా 2025 ప్రారంభమైంది. ఈ సందర్భంగా సంగమ పవిత్ర జలాల్లో స్నానం చేసేందుకు కోట్లాది మంది భక్తులు ప్రయాగ్ రాజ్ చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా గంగా, యమున, సరస్వతి నదులు కలిసే ప్రదేశంలో స్నానం ఆచరించి, పూజలు చేస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో కుంభమేళాలో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.




## యువ బ్రాహ్మణ దంపతులకు మధ్యప్రదేశ్ ప్రభుత్వ బోర్డు వినూత్న ఆఫర్

**నలుగురు పిల్లలను కంటే రూ.లక్ష బహుమతి**

**భోపాల్ :** యువ బ్రాహ్మణ దంపతులకు మధ్యప్రదేశ్ ప్రభుత్వ బోర్డు వినూత్న ఆఫర్ ఇచ్చింది. బ్రాహ్మణ యువ జంటలు నలుగురు పిల్లలను కంటే రూ.లక్ష బహుమతిగా ఇస్తామని ప్రకటించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన పరుశురామ్ కళ్యాణ్ బోర్డు అధ్యక్షుడు పండిట్ విష్ణు రజోరియా ఈ ప్రకటన చేశారు. రాష్ట్ర క్యాబినెట్ హోదాలో ఉన్న ఆయన ఇలాంటి ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది.మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన బ్రాహ్మణ కమ్యూనిటీకి సంబంధించిన కార్యక్రమంలో రజోరియా మాట్లాడుతూ.. దేశంలో నాస్తికుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నదని అన్నారు. మనం కుటుంబాలపై దృష్టి సారించకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. 'నాకు యువత మీద చాలా ఆశలు ఉన్నాయి. వయసుపైడిన వారిపై పెద్దగా ఆశలు పెట్టుకోలేం. జాగ్రత్తగా వినండి. భవిష్యత్ తరాన్ని రక్షించాల్సిన బాధ్యత మీపైనే ఉంది. యువత జీవితంలో సెటిలై ఒక సంతానంతో సరిపెట్టుకుంటున్నారు. ఇది పెద్ద సమస్య అయిపోయింది. ప్రతి జంట నలుగురు పిల్లలను కనాలని నేను మిమ్ములను కోరుతున్నా' అని రజోరియా సూచించారు.నలుగురు పిల్లలను కంటే ఆ బ్రాహ్మణ జంటకు పరుశు రామ్ కళ్యాణ్ బోర్డు రూ.లక్ష బహుమతి ఇస్తుందని రజోరియా చెప్పారు. బోర్డు అధ్యక్షుడిగా తాను ఉన్నా లేకున్నా ఈ నగదు పురస్కారం ఇవ్వబడుతుందని అన్నారు. యువత చాలా మంది పిల్లల చదువుల ఖర్చు భారీగా ఉంటుందని చెబుతున్నారని, ఏదోలా పిల్లలను చదించుకోవాలని, ఖర్చు భయంతో పిల్లలను కనడం ఆపవద్దని సూచించారు. అలా చేస్తే దేశం పూర్తిగా నాస్తికుల చేతుల్లోకి వెళ్లిపోతుందని చెప్పారు.అనంతరం రజోరియా ఓ జాతీయ ఛానెల్‌తో మాట్లాడుతూ.. ఈ ప్రకటన పూర్తిగా తన వ్యక్తిగతమని, ఈ ప్రకటనతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. బ్రాహ్మణ కులానికి సంబంధించిన కార్యక్రమంలో తాను ఈ ప్రకటన చేశానని చెప్పారు. పిల్లలను చదివించడం, ఉన్నత స్థానాలకు చేర్చడం బ్రాహ్మణ సమాజానికి పెద్ద కష్టమేమీ కాదని అన్నారు.

## రైతులకు గుడ్ న్యూస్.. వచ్చే నెల ఖాతాల్లోకి రూ.10 వేలు



వచ్చే ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పూర్తి బడ్జెట్లో రైతులకు గుడ్ న్యూస్ రాబోతుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద వార్షికంగా వచ్చే మొత్తం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పలు వర్గాల సమాచారం ప్రకారం రైతులకు చెల్లించే వార్షిక మొత్తం రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెరుగుతుందని చెబుతున్నారు. దీంతో ఈ పథకంలో నమోదు చేసుకున్న రైతులందరూ దీని ప్రయోజనాన్ని పొందనున్నారు. బడ్జెట్ మొదటి రోజు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

**ఫిబ్రవరి మొదటి వారంలో..**

అయితే దీని గురించి అధికారికంగా ఎవరూ ప్రకటించలేదు. కానీ పెంచే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి ఒక్కొక్కటి రూ. 2,000 చొప్పున మూడు వాయిదాలలో రూ. 6,000 అందిస్తుంది. ప్రతి వాయిదా చెల్లింపుల మధ్య నాలుగు నెలల అంతరం ఉంటుంది. తదుపరి విడత డబ్బును ఫిబ్రవరి మొదటి వారంలో విడుదల చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బడ్జెట్లో ఈ మొత్తం పెంచిన తర్వాత, పెరిగిన మొత్తం చెల్లిస్తారా లేదా పాత వాయిదా వస్తుందా అని రైతులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.

**వీరికి ఎంతో ఉపయోగం..**

తాజా సమాచారం ప్రకారం రైతుల %వ-ఖ్జ% (ఎలక్ట్రానిక్ కేవైసి) పూర్తి చేసుకున్న వారికే పథకంలో ప్రయోజనం లభిస్తుంది. %వ-ఖ్జ% పూర్తి చేయని రైతులు ఈ పథకం ప్రయోజనాలు పొందలేరు. అయితే గతంలో రైతులు ఏడాదికి రూ. 6 వేలను మూడు వాయిదాలను పొందుతారు. ఇప్పుడు పెంచనున్న రూ.10 వేల మొత్తాన్ని మూడు వాయిదాలలో ఎలా చెల్లిస్తారని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ పథకం కింద అందించే మొత్తం రూ.10,000 అందిస్తే రైతులకు వ్యవసాయ పనులు, కూలీలకు, కరెంట్ సహా ఇతర ఖర్చులకు ఈ నిధులను ఉపయోగించుకోవచ్చు. ముఖ్యంగా చిన్న రైతులకు ఈ మొత్తం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ నిధులు రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు.

**పీఎం కిసాన్ నిధి పథకం**

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2018 డిసెంబర్ 1న ప్రారంభించింది. ఈ పథకం కింద రైతులకు ఆర్థిక సహాయం అందించడం లక్ష్యంగా ఉంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా రైతులకు సహాయం అందించడమే ఈ పథకపు ప్రధాన ఉద్దేశం. 18వ విడత విడుదలతో దేశవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రైతులు %ూవీ-ఖ×ూూచీ% పథకం కింద రూ. 3.45 లక్షల కోట్లు అందుకున్నారు. ఈ ఏడాది 19వ విడత నిధులు విడుదల చేయనున్నారు.

## గతేడాది హతమైన ఉగ్రవాదుల్లో 60 శాతం మంది పాకిస్తానీయులే



**న్యూఢిల్లీ :** గతేడాది హతమైన ఉగ్రవాదుల్లో 60 శాతం మంది పాకిస్తాన్ సంతతికి చెందిన వారేనని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. హింసను ప్రేరేపించేందుకు పాకిస్తాన్ పాత్ర ఏంటో ఈ చర్యతో తెలిసి పోతుందన్నారు. జనవరి 15వ తేదీన ఆర్మీ డే సందర్భంగా ఆర్మీ చీఫ్ జనరల్ ఇవాళ మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లో హింసను ప్రేరేపిస్తున్నారని తెలిపారు. ఉగ్రవాద చర్యలను నిరోధించేందుకు గతేడాది 15 వేల మంది సైనికులను చేర్చుకుకోవడంతో ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం అభివృద్ధి చెందుతున్న సమయంలోనే ఉగ్రవాదులు తమ చర్యలను వేగం చేశారు. ఈ ఉగ్రవాదుల్లో 80 శాతం మంది పాకిస్తానీలు ఉన్నారని, గతేడాది 60 శాతం మందిని అంతమొందించామని తెలిపారు. ఇక భారత్, చైనా సైన్యాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నాలు అవసరమని పేర్కొన్నారు. సరిహద్దుల్లో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలు పెంచడం, కెపబిలిటీ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించామని తెలిపారు. చొరబాటు ప్రయత్నాలను అడ్డుకుంటున్నామని ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు.

# మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం

-మొదటిపేజీ తరువాయి

ఫ్యాన్ పార్టీ అధినేత పూర్తిగా నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయాయని, ఆ విషయం ఆయన మాటల ద్వారా అర్థమవుతోందని పార్థసారథి చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో రైతులంతా సంతోషంగా ఉన్నారని, ధాన్యం సేకరణ విషయంలో జగన్ ప్రభుత్వం ఎలా మోసం చేసిందో రైతులకు తెలుసని మంత్రి విమర్శించారు. బిందు సేద్యం, పామాయిల్, మామిడి, ధాన్యానికి మద్దతు ధర వంటి వాటితో అన్నదాతలు సంతోషంగా ఉన్నారని, రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందని తెలిపారు. అందుకే ఈ సంక్రాంతికి గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత సంతోషంగా అన్నదాతలు ఉన్నారని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పుకొచ్చారు.

**ఆనందంగా సంక్రాంతి..**

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. "రైతుల నుంచి దాదాపు 29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లోనే వారికి డబ్బులు చెల్లించాం. అందుకే రైతులు నేడు చాలా సంతోషంగా సంక్రాంతి పండగ నిర్వహించుకుంటున్నారు. గత ప్రభుత్వం చేసిన మోసాలను రైతులు ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. ధాన్యం సేకరించి జగన్ ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోతే మా ప్రభుత్వం ఆ బకాయిలు చెల్లించింది. ధాన్యం సేకరణలో వైసీపీ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేసింది. వైసీపీ ప్రభుత్వంలో అన్యాయంగా రద్దు చేసిన అనేక కార్యక్రమాలను పునరుద్ధరించాం. ప్రతినెలా ఒకటో తేదీ నాటికి పెంచిన పెన్షన్లతో ఇళ్లకు



వెళ్లి అందిస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రతి కుటుంబానికీ రూ.12 వేలు తల్లికి వందనం పేరుతో ఇవ్వబోతున్నాం. సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి మా భూమి మాదే అనే ధైర్యం ప్రజలకు కల్పించాం. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల పొట్ట నింపే కార్యక్రమం సీఎం చేపట్టారు.

**వైసీపీ పాలనలో అధోగతి..**

వైసీపీ హయాంలో సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వెళ్లలేమని ఏపీ ప్రజలు బాధపడేవారు. నేడు ఊరూరా రోడ్లు వేయడంతో సొంతూళ్లకు ఆనందంగా వెళ్లారు. ఏపీలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. సంక్రాంతి పండగను సంబరంగా చేసుకుంటున్నారు. పారిశ్రామికంగా ఈ రాష్ట్రం వైసీపీ పాలనలో అధోగతి పాలైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక లోకేశ్ విదేశీ పర్యటనలు చేపట్టి పెట్టుబడులను తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో చాలా మంది పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఓ పరిశ్రమ పెట్టాలంటే తమకేంటని పాలకులు దోచుకున్నారు. 2018-19లో డేటా సెంటర్?కు 130 ఎకరాలు కేటాయిస్తే వైసీపీ పాలనలో అసలు పట్టించుకోలేదు. రాష్ట్రంలో వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లేక వలసలు వెళ్లారు. వచ్చే రెండేళ్లల్లో రాష్ట్రంలో లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తున్నాయి.

**లోకేశ్ వల్లే..**

చంద్రబాబుపై నమ్మకంతో ప్రజలంతా పండగ చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ఏపీ గాడిన పడిందని, అభివృద్ధి జరుగుతోందని ప్రజలు నమ్ముతున్నారు. వైసీపీ నేతలు రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేస్తున్నారు. జగనన్న కాలనీలకు %ూహీూ%-ఎన్టీఆర్ నగర్ పేరు సబబేనని భావిస్తున్నాం. జగన్ ఇప్పుడు కూడా నేర ప్రవృత్తితో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికీ తీరు మార్చుకోకుంటే ప్రజలు ఈసారి మరింత బలంగా బుద్ధి చెబుతారు. మూడు నెలల్లో ప్రభుత్వం పడిపోతుందని జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం. జగన్ పగటి కలలు కంటున్నారా?.. రాత్రి కలలు కంటున్నారా?.. లేక రాజకీయ పరిస్థితులకు మైండ్ చలించి మాట్లాడుతున్నారా? అనే అనుమానం కలుగుతోంది. వైనాట్ 175 అన్న నినాదం ఏమైందో ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో అందరికీ తెలుసు. వైసీపీ నేతల గాలి మాటలను పట్టించుకోమని" చెప్పారు.

# నారావారిపల్లె నుంచే అభివృద్ధి పనులకు శ్రీకారం

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఈజీ మార్ట్ ద్వారా పలువురు మహిళలు అవగాహన కలిగేలా ఆన్లైన్‌లో నిత్యవసర సరుకులు కొనుగోలు చేశారు. మొత్తం ఎన్ని మార్టులు ఉన్నాయని మార్ట్ ప్రతినిధులను సీఎం ప్రశ్నించగా.. ప్రస్తుతానికి కుప్పంలో ఈజీ మార్ట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, త్వరలో తిరుపతి జిల్లా అంతటా మార్టుల ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 15 మంది మహిళలకు స్వయంఉపాధి నిమిత్తం సబ్సిడీతో ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ చేశారు. ఈ-ఆటోల ద్వారా నెలకు ఆయిల్ రూపంలో రూ.12 వేల వరకూ ఆదా అవుతుందని సీఎంకు అధికారులు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల్లో 100 శాతం శారీరక, మానసిక, ప్రవర్తనా సంసిద్ధత తీసుకొచ్చేందుకు కేర్ అండ్ గ్రో సంస్థతోనూ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా నారావారిపల్లె పరిధిలోని 8 అంగన్వాడీ కేంద్రాల్లో దీన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని కుప్పంలో ప్రారంభించగా తల్లులు, అంగన్వాడీ టీచర్లు సంతృప్తిగా ఉన్నారని, చిన్నారులు కూడా యాక్టివ్‌గా వున్నారని సీఎం అన్నారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం**

సొంతూరు నారావారిపల్లె నుంచే పలు అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. చంద్రగిరి మండలంలోని రంగంపేటలో రూ.1.10 కోట్లతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, రూ.3.2కోట్లతో కందులవారిపల్లి, చిన్నరామాపురం, ఎ.రంగంపేట గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నారావారిపల్లెలో రూ. 4.27 కోట్లతో విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. సోలార్ రూఫ్‌టాప్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా.., పాలసీపై పూర్తి అవగాహనతో ఉన్నారా అని అధికారులను ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీతో సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు రాయితీ కల్పిస్తున్నామన్నారు. ఇతరులకు కూడా 2 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి రూ. 60 వేలు రాయితీ అందుతుందని, వెచ్చించిన మిగతా మొత్తాన్ని గ్రిడ్‌కు విద్యుత్ అందించడం ద్వారా ఐదారేళ్లలో తీర్చుకోవచ్చున్నారు. ఇచ్చిన పాలసీ అందరూ అర్థం చేసుకోవాలన్నారు.




**రైతులకు స్పింకర్లు, డ్రిప్ పంపిణీ**

సూక్ష్మ సాగునీటి పథకంలో భాగంగా రైతులకు డ్రిప్‌లు, స్ప్రింకర్లు పంపిణీని చేపట్టారు. తిరుపతి జిల్లాలోని రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన సామాగ్రి లారీలను జెండా ఊపి ముఖ్యమంత్రి ప్రారంభించారు.

**ఆ కలెక్టర్‌పై సీఎం చంద్రబాబు ఫైర్**

చిత్తూరు: నారావారిపల్లిలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించారు. సోలార్ పాలసీపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు. ప్రో యాక్టివ్‌గా ఉండాలని కలెక్టర్‌కు చంద్రబాబు చురకలు అంటించారు. సోలార్ పాలసీ మీద సంబంధిత విభాగం వారికి కూడా అవగాహన లేకపోవడంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారావారిపల్లి సమీపంలోని 2వేల ఇళ్లకు సోలార్ విద్యుత్ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం చంద్రబాబు అన్నారు. 2కేవీ వరకు ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితంగా ఇస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. సోలార్‌తో వినియోగదారులకు ఎదురు డబ్బు వస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాగా.. సీఎం చంద్రబాబు ఈ ఏడాది కూడా తన స్వగ్రామైన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో సంక్రాంతి పండుగ చేసుకుంటున్నారు. ఆదివారం రాత్రికే ఇక్కడకు చేరుకున్నారు. తిరుపతిలో ఆదవారం పలు కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ శేముషీ బాజ్‌పాయ్, ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ తదితరులు సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి 15వ తేదీ వరకూ అక్కడే ఉంటారు. సోమవారం నారావారిపల్లె అభివృద్ధికి సంబంధించిన పలు పనులకు శంకుస్థాపన చేస్తారు. మంగళవారం కూడా అక్కడే ఉండి బుధవారం మధ్యాహ్నం అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు.

# కొలికపూడి సంగతేంటీ

**విజయవాడ :** తెలుగుదేశం పార్టీ అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ. ప్రాంతీయపార్టీ కావడంతో అధినేత ఆగ్రహానికి గురి కాకూడదని ఎవరైనా భావిస్తారు. కానీ ఈ టర్మ్ లో మాత్రం ఎమ్మెల్యేలు మాత్రం నోరు జారిపోతున్నారు. తాడిపత్రిలో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రతి రోజూ ఏదో ఒక వివాదాస్పద వ్యాఖ్యలు చేసి కూటమి పార్టీలకు తలనొప్పిగా తయారయ్యారు. మూడు పార్టీల్లోనూ ఇబ్బందికరమైన పరిస్థితులను ఎమ్మెల్యేలు సృష్టిస్తున్నారు. కానీ అధినాయకత్వం ఏ చర్యలు తీసుకోలేకపోతుంది. ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి ఆ పార్టీ లైన్ కు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. జనసేనలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానానాజీ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటున్నారు. ఇక టీడీపీలో కృష్ణాజిల్లాలోని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కూడా అంతే. ఆయనను కట్టడిచేయడం ఎవరి వల్ల కావడం లేదు. తొలిసారి గెలిచిన కొలికపూడి శ్రీనివాసరావు సొంత పార్టీ నేతలను ఇబ్బంది పెడుతున్నారు. అమరావతి రాజధాని ఉద్యమంలో పాల్గొని చంద్రబాబుకు దగ్గరై కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు టిక్కెట్‌ను సంపాదించారు. చివరకు సీనియర్ నేతలు జవహర్‌ను కూడా పక్కన పెట్టి కొలికపూడికి చంద్రబాబు టిక్కెట్ ఇచ్చారు. కొలికపూడి శ్రీనివాసరావు ఎమ్మెల్యే అయిన వెంటనే తన వైఖరిని పూర్తిగా మార్చారు. సొంతపార్టీ నేతలనే వేధింపులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. తిరువూరు నియోజకవర్గంలో ఒక ఇంటిని కూల్చివేయడానికి తానే కుర్చీ వేసుకుని కూల్చేందుకు చేసిన ప్రయత్నం కూడా విమర్శలకు దారి తీసింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొలికపూడి శ్రీనివాసరావును పిలిచి క్లాస్ పీకినట్లు వార్తలు వచ్చాయి. ఇక ఇటీవల కొలికపూడి కమ్మ సామాజికవర్గం నేతలపై చేసిన వ్యాఖ్యలు పెద్దదుమారమే రేపాయి. తిరువూరులో తక్కువ శాతం ఉన్న కమ్మ సామాజికవర్గం నేతల ఆధిపత్యం ఏంటని ఆయన బహిరంగంగానే ప్రశ్నించారు. అన్నిపదవులు, ప్రధానమైనవన్నీ కమ్మవారికే కావాలంటే ఎలా? అని ప్రశ్నించారు. టీడీపీ గెలుపునకు కారణమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పదవులు ఎలా వస్తాయని, కమ్మోళ్లను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని కూడా ఆయన గట్టిగా కృష్ణా జిల్లాలో ప్రశ్నించడంతో ఆయన వైఖరిపై తెలుగుదేశంపార్టీ అధినాయకత్వం గుర్రుగా ఉంది. కొలికపూడి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయాన్ని తిరువూరులోని ముఖ్య నేతలతో పాటు కమ్మ సామాజికవర్గం నేతలు కూడా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. లోకేష్ కూడా ఆయన వైఖరిని తప్పుపట్టినట్లు చెబుతున్నారు.



తాజాగా తిరువూరు నియోజకవర్గంలోని గొపాలపురంలో ఒక రహదారికి సంబంధించి ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తలదూర్చారు. వారిలో ఒక వర్గానికి అండగా నిలబడ్డారు. అయితే ఎమ్మెల్యే కొలికపూడి తమను కొట్టి అవమానపర్చారంటూ భూక్యా చంటి పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. వైసీపీ వార్డు సభ్యురాలిగా ఉన్న భూక్యాచంటిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో ఎమ్మెల్యే తలదూర్చి పార్టీకి తలనొప్పిగా మారారంటున్నారు. అయితే భూక్యాచంటికి ప్రమాదం తప్పిందని వైద్యులు చెప్పారు. దీనిపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు అందింది. ఈ వివాదానికి సంబంధించి కొలికపూడి నుంచి వివరణ తీసుకోవాలని చంద్రబాబు పార్టీనేతలను ఆదేశించారు. మొత్తం మీద ఎమ్మెల్యే కొలికపూడి పార్టీకి తలనొప్పిగా తయారయ్యారు. ఆయనకు ఎన్నిసార్లు చెప్పినా ఆగేట్లు లేదని, ఆయనను వదిలించుకోవడమే మేలన్న అభిప్రాయం పార్టీ అధినాయకత్వంలో మొదలయిందంటున్నారు.

# మోడీ స్కూల్లో టీడీపీ




-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు ఆలోచన. అందుకు మూడు పార్టీలూ కలసి పోటీ చేస్తాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ లో జగన్ బలమైన శత్రువు. జగన్ ను అంత తేలిగ్గా చంద్రబాబు అంచనా వేయరు. ఎందుకంటే 2024 ఎన్నికల్లోనూ జగన్ ఒంటరిగా పోటీ చేసి 40 శాతం ఓట్లు తెచ్చుకున్నారంటే ఆషామాషీ కాదన్న సంగతి నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు తెలియంది కాదు. ఐదు శాతం ఓట్లు పెరిగినా సీట్లు గల్లంతవుతాయి. అందుకే జగన్ కు బలమైన ప్రాంతాల్లో చంద్రబాబు ఫోకస్ పెట్టినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేక స్ట్రాటజీలతో చంద్రబాబు వెళుతున్నట్లే కనిపిస్తుంది. ఒకవైపు పాలనను గాడిలో పెడుతూనే మరొక వైపు జగన్ ను మరింత బలహీనం చేసే ప్రయత్నంలో చంద్రబాబు నిరంతరం స్కెచ్ వేస్తుంటారన్నది కాదనలేని వాస్తవం. అందులో భాగంగానే పవన్ కల్యాణ్ ను ప్రయోగించినట్లు సమాచారం. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు యువతలోనూ, సామాజికవర్గంలోనూ బలమైన పట్టుంది. రాయలసీమలో జగన్ బలం తక్కువేమీ కాదు. అక్కడ రెడ్డి సామాజికవర్గం ఎక్కువ కావడంతో పాటు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానంతో పాటు టీడీపీ వ్యతిరేక ఓట్ల శాతం ఒకింత ఎక్కువగానే ఉన్నాయి. కానీ గత ఎన్నికల్లో ఎప్పుడూ లేని విధంగా రాయలసీమలోనూ కూటమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించడానికి పవన్ కల్యాణ్ కూడా ఒక కారణమని ఆయన నమ్ముతున్నారు. అందుకే జగన్ సొంత జిల్లా అయిన కడపలోనే కేవలం వైసీపీని మూడు సీట్లకే పరిమితం చేయగలిగామన్నా, ఎన్నడూ గెలవని సీట్లను గెలుచుకున్నా, సుదీర్ఘకాలం తర్వాత నియోజకవర్గాలను సొంతం చేసుకున్నా అందులో పవన్ కల్యాణ్ పాత్ర ఎక్కువగా ఉందని చంద్రబాబు విశ్వసిస్తున్నారు. బలిజ సామాజికవర్గం ఓట్లను... అందుకే రాయలసీమపై పవన్ కల్యాణ్ ను చంద్రబాబు ప్రయోగించినట్లే కనపడుతుంది. పవన్ కల్యాణ్ పర్యటించకున్నా ఉభయ గోదావరి జిల్లాల్లో కూటమి బలంగా ఉంటుంది. ఇక కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలలో తెలుగుదేశం పార్టీ పట్టు సడలదు. ఇక రాయలసీమలో దాదాపు యాభై రెండు నియోజకవర్గాల్లో అత్యధిక స్థానాలను సొంతం చేసుకోవాలంటే అంత సులువు కాదు. జగన్ ను దెబ్బకొట్టాలంటే అక్కడ ఉన్న మరో బలమైన సామాజికవర్గం బలిజలను తమవైపునకు తిప్పుకోవాలి. అందుకే పవన్ కల్యాణ్ తరచూ కడప, కర్నూలు జిల్లాల్లో పర్యటిస్తున్నారని చెబుతున్నారు. చంద్రబాబు సూచనల మేరకే పవన్ కల్యాణ్ సీమ జిల్లాల్లో పర్యటనలు చేస్తున్నారని సమాచారం. కడపలో కూడా క్యాంప్ కార్యాలయం ప్రారంభిస్తానని పవన్ కల్యాణ్ చేసిన ప్రకటన వెనక కూడా ఇదే ప్రధాన కారణం అని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు స్కూలులో సిలబస్ మారినట్లే కనిపిస్తుంది.

## క్యూ ఆర్ కోడ్‌లో రేషన్ కార్డులు



**కర్నూలు :** ఏపీలో త్వరలోనే నూతన రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయి. నవ దంపతులకు కొత్త కార్డులు జారీ చేయనుండగా, పేర్ల మార్పు చేర్పులకు అవకాశం కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు రాజకీయ పార్టీల రంగులతో ఇచ్చిన రేషన్ కార్డులకు చరమగీతం పాడడంతో పాటు అత్యాధునిక కార్డులను అందించేందుకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ సన్నాహాలు ప్రారంభించారు.ఆరునెలల పాలనా కాలంలో క్రమంగా అధికార యంత్రాంగాన్ని గాడిన పెడుతూ వస్తున్న కూటమి ప్రభుత్వం.. క్రమంగా ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వస్తోంది. అందులో భాగంగా పౌర సరఫరాల శాఖలోని అవినీతిపై పెద్ద ఎత్తున దాడులు చేస్తూ.. అక్రమార్కుల ఆట కట్టించింది. ఇక ఇప్పుడు.. నూతన లబ్ధిదారుల ఎంపిక, వారికి జారీ చేయనున్న కార్డుల విషయమై కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ఆగిపోగా.. అనేక మంది లబ్దిదారులకు కార్డులు జారీ కాలేదు. అలాంటి వారందరికీ ఇప్పుడు.. సరికొత్త కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.కొత్తగా పెళ్లైన దంపతులకు, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులకూ అవకాశం కల్పించనున్నారు. ఇందు కోసం.. ప్రత్యేకంగా.. ఆన్ లైన్ పోర్టల్ ప్రారంభించనున్నారు. అందుబాటులోని సాంకేతికతను వినియోగించుకుని.. ఇకపై రేషన్ కార్డుల్ని క్రెడిట్ కార్డుల తరహాలో క్యూఆర్ కోడ్ లతో జారీ చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే.. సన్నాహాలు కూడా పూర్తయ్యాయి. ఈ నెల చివర్లో కానీ, వచ్చే నెల ప్రారంభంలో కానీ.. రాష్ట్ర వ్యాప్తంగా కార్డుల్ని జారీ ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.కార్డులపై క్యూఆర్ కోడ్ ఉండనుండగా.. అందులో కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలు ఉండనున్నాయి. రేషన్ పంపిణీ సమయంలో ఆ కోడ్ ను స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలిసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపితే.. వెంటనే కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం.. అధికార యంత్రాగం, ప్రభుత్వం వివిధ పనుల్లో బిజీబిజీగా గడుపుతోంది. తీరికలేని హడావిడిలో ఉండడంతోనే.. కార్డుల ఆమోదం, జారీ ప్రక్రియ ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం హయంలో కొత్తగా పెళ్లైన వాళ్లకు వెనువెంటనే రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించారు. కానీ.. కొన్ని నెలలకే ఆ విధానాన్ని పక్కన పెట్టేశారు. ఆరునెలలకు ఓ సారి మాత్రమే కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. దాంతో.. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా మంజూరు చేయాల్సిన కొత్త కార్డులు చాలానే మిగిలిపోయాయి. ఈసారి వాటిని జారీ చేయడంతో పాటు వెనువెంటనే నూతన దంపతులకు కార్డులు మంజూరు చేసే అవకాశాన్ని కల్పించనున్నట్లు సమాచారంరాష్ట్రంలోని చాలా రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు తప్పుల తడకగా మారాయి. దాంతో.. అనేక పథకాల లబ్ధిదారులు నష్టపోతున్నారు. పేర్లు తేడాగా ఉంటున్న కారణంగా చాలా పథకాలకు అనుసంధానించేందుకు వీలు కావడం లేదు. పైగా..ఆన్ లైన్ విధానాన్ని సైతం ఆపేయడంతో.. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ఈ సమస్యలన్నింటినీ ఈ సారి నూతన కార్డుల జారీ సమయంలో పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉండగా.. 3.36 లక్షల రేషన్ కార్డు సమస్యలు పెండింగ్ లో ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. వీటిలో.. 70 వేలకు పైగా నవదంపతుల నుంచి అందిన దరఖాస్తులుగా చెబుతున్నారు. కార్డుల్లో విభజన కోసం 46 వేలకు పైగా, కొత్త సభ్యుల చేరికలకు 2 లక్షల 13 వేలు, సభ్యులను తొలగించేందుకు 36 వేలు, అడ్రస్ మార్పుల కోసం 9 వేలకు పైగా దరఖాస్తులు అందగా.. రేషన్ కార్డుల్ని సరెండర్ చేసేందుకు 685 మంది సిద్ధంగా ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇలా.. అన్ని రకాలుగా చూస్తే మరో 2 లక్షల రేషన్ కార్డులు ఇవ్వాల్సి వస్తుందని అధికారుల అంచనా. దాంతో.. రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.50 కోట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## సంపాదకీయం

# మనం గుర్తించని మహా శాస్త్రవేత్త

ఆయన మానవ శరీరంలో విటమిన్ బి నిర్వహిస్తున్న అత్యంత కీలకమైన పాత్రను కనుగొన్నాడు. దాన్ని గుర్తించడమే కాదు, వెలికితీసి కృత్రిమంగా తయారు చేయడానికి మార్గం సుగమం చేశాడు. విటమిన్ బి ని ప్రజారోగ్యం కోసం ఇప్పటికీ ప్రపంచం ఉపయోగిస్తోంది. ఆయన పరిశోధన విటమిన్-12 తయారీకి దారితీసింది. దాన్ని కూడా నేడు ప్రపంచ వ్యాపితంగా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఆయన ఈ రోజు క్యాన్సర్ చికిత్సలో ముఖ్యంగా పిల్లల్లో వచ్చే ల్యుకేమియా చికిత్సలో కీలకమైన మెథోట్రెగ్జేట్ ఔషధాన్ని రూపొందించాడు. ఆయన ఉష్ణ మండలాల్లో దోమకాటు వల్ల వచ్చే బోదకాలు వ్యాధిని నయం చేసే మందు డిఇథైల్‌కార్బమజైన్‌ను కనుగొన్నాడు. ప్రపంచ వ్యాపితంగా బోదకాలు వ్యాధి నివారణలో ఇది అమోఘంగా పనిచేసింది. అన్నిటికీ మించి యాంటీబయాటిక్స్ తయారీలో ఆయన కృషి నేటికీ ఏనాటికీ ప్రపంచం ఆయనకు రుణపడి ఉంటుంది. విభిన్న రకాల బ్యాక్టీరియా వ్యాధులను నయం చేసే మందుల్లో ఉపయోగించే టెట్రాసైక్లిన్ అభివృద్ధిలో కీలక పాత్ర నిర్వహించాడు. ఇంత గొప్ప పరిశోధనలు చేసి మానవాళి ఆరోగ్యానికి మహోపకారం చేసిన ఆ వ్యక్తి డా॥యల్లాప్రగడ సుబ్బారావు మన ఆంధ్రుడనీ, భీమవరంలో పుట్టి ప్రాథమిక చదువులు చదివి, మద్రాసులో ఉన్నత విద్యనభ్యసించి, అమెరికా వెళ్లి గొప్ప పరిశోధనలు చేసి ప్రపంచ ప్రజలకు కలకాలం ఉపయోగపడే పరమౌషధాలు తయారీకి తోడ్పడ్డాడనీ చాలా తక్కువ మందికే తెలుసు. నిజానికి యల్లాప్రగడ సుబ్బారావు చేసిన పరిశోధనలు, ఆయన కనుగొన్న ఆవిష్కరణలకన్నా తక్కువ చేసిన వారికి నోబెల్ బహుమతులు లభించాయి. ఆయన కన్నా తక్కువ కృషి చేసిన వారికి మన దేశంలో మరణానంతర భారత రత్న బిరుదులు లభించాయి. కానీ సుబ్బారావు పరిశోధనా ఫలితాలు నేటికీ అనుభవిస్తున్న ప్రపంచం గానీ, ఆయన భారతీయుడై పుట్టినందుకు మన దేశం గానీ ఆయనకు తగిన గుర్తింపు నివ్వలేదు. కారణం ఏమై ఉండొచ్చు? బహుశా యల్లాప్రగడ సుబ్బారావు భారతీయ సంతతికి చెందిన శాస్త్రవేత్త గనుక వందేళ్ల క్రితం పశ్చిమ దేశాల్లో నెలకొన్ని ఉన్న వివక్ష ఆయనకు నోబెల్ బహుమతిని దూరం చేసి ఉండవచ్చు, ఆయన భారత్‌లో పుట్టినా అమెరికాలో పరిశోధనలు చేశారు కాబట్టి మన దేశం ఆయనను విస్మరించి ఉండవచ్చు. కానీ ప్రపంచ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడ్డంలో చేసిన పరిశోధనలు, ఆవిష్కరణలకుగాను ఆయన సర్వ మానవాళికీ ప్రాత:స్మరణీయుడుగా నిలిచిపోతాడు. ఈ రోజు యల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతి. ఆయన భీమవరం పట్టణంలో 1895 జనవరి 12వ తేదీన జన్మించి 1948 ఆగస్టు 8న అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 53వ ఏట కన్నుమూశారు. కేవలం 53 ఏళ్ల లోనే ఆయన అన్ని విజయాలు సాధించారంటే ఇంకా నిండు జీవితం గడిపి ఉంటే ఇంకా ఎన్ని గొప్ప ఆవిష్కరణలు చేసేవాడో కదా! సుబ్బారావు తండ్రి పేరు జగన్నాథం. చిరు ఉద్యోగిగా రిటైర్ అయ్యాడు. దాంతో సుబ్బారావు తల్లి పట్టుబట్టి రాజమండ్రికి పంపించి మెట్రిక్యులేషన్ చదివించింది. ఫెయిలయ్యాడు. ఇంతలో తండ్రి మరణించాడు. తల్లి పట్టుదలతో కొడుకు చదువు కోసం పుస్తెలు అమ్మి మద్రాసుకు పంపించింది. మద్రాసు హిందూ ఉన్నత పాఠశాలలో చేరి, చదువులో ముందడుగు వేశాడు. మద్రాసు ఇండియన్ మెడికల్ కాలేజీలో ఎల్.ఐ.ఎం చేసి, కార్పొరేషన్ ఆయుర్వేద హాస్పటల్‌లో నెలకు అరవై రూపాయల జీతం మీద పని చేశాడు. విదేశాలకు వెళ్లి పరిశోధనలు చేయాలని వైద్య శాస్త్రాన్ని శోధించి, పరిశోధించి అనేక రహస్యాలను వెలికి తీయాలనే దృఢమైన కాంక్షతో అమెరికా వెళ్లి హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో చేరి పరిశోధనలు చేపట్టాడు. ఆయన భార్య పేరు శేషగిరి. మామ కస్తూరి సూర్యనారాయణ మూర్తి, సుబ్బారావు ఉన్నత చదువులకు ఆర్థికంగా సహకరించారు. హార్వర్డ్‌లో యల్లాప్రగడ సుబ్బారావు ఆవిష్కరణల పరంపర 1925లో ప్రారంభమైంది. సైరస్ ఫిస్కే అనే శాస్త్రవేత్తతో కలిసి ఆయన మానవ శరీరంలోని ద్రవంలో భాస్వరం ఎంత ఉందో కనుగొనే పద్ధతిని కనిపెట్టాడు. దీన్ని అప్పటి నుండి ఫిస్కే-సుబ్బారావు పద్ధతిగా పేర్కొంటున్నారు. తరువాత 1927లో ఫాస్ఫోక్రియాటైన్, 1929లో అడినోసిన్ ట్రైఫాస్ఫేట్ (ఎటిపి)లను ఆయన కనుగొన్నాడు. 1930లో ఆయన హార్వర్డ్ నుండి పిహెచ్‌డి పొందాడు. 1940 వరకు హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో టీచింగ్ ఫెలోగా పనిచేశారు. తరువాత లెడెర్లె లాబరేటరీలో రిసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్‌గా చేరి, 1942లో దాని డైరెక్టర్ అయ్యారు. ఈ కాలంలో ఆయన వైద్య రంగానికి సంబంధించిన నాలుగు అతి ముఖ్యమైన పదార్థాలను కనుగొన్నాడు. వాటిలో మొదటిది, టెట్రాసైక్లిన్ యాంటీ బయోటిక్స్‌లో మొదటిదైన ఆరియోమైసిన్. తరువాత 1947లో బోదకాలు నయం చేసే హెట్రాజన్ (డైథీలెర్బామాజైన్ సిట్రేట్) కనుగొన్నాడు. 65 ఏళ్ల తరువాత ఇప్పటికీ ఈ మందును వాడుతున్నారు. తరువాత ఆయన కనుగొన్న మూడోది, విటమిన్-బి (ఫోలిక్ యాసిడ్). తరువాత ఆయన పరిశోధనలు విటమిన్-బి కనుగొనే వరకు వచ్చాయి. కానీ వాస్తవంగా ఆయన పరిశోధనలపై ఆధారపడి తరువాత దాన్ని కనుగొన్నారు. నాల్గవది, శరీర కణాల పెరుగుదలను నిలువరించి క్యాన్సర్‌ను నయం చేయగల అమినోప్టెరిన్‌ను ఆయన కనుగొన్నాడు. యల్లాప్రగడ సుబ్బారావు కనుగొన్న ఈ మందులన్నీ దశాబ్దాలు గడిచిపోయినా నేటికీ ఉపయోగంలో ఉన్నాయంటే ఆయన ఆవిష్కరణల విశిష్టత అర్థమవుతుంది. ఇవే కాకుండా ఆయన కనుగొన్న విషయాలు చాలా ఉన్నాయి. మానవాళికి ఉపయోగపడే ఇంత గొప్ప పరిశోధనలు చేసిన సుబ్బారావు అవి ప్రజలకు ఉపయోగ పడాలనుకున్నాడే గాని వాటికి పేటెంట్లు ఆశించలేదు. అలా ఆశించి ఉంటే ఆయన శతకోటీశ్వరుడై ఉండవాడు. అలాగే ఆయన ఎటువంటి గుర్తింపును కూడా ఆశించలేదు. నిజానికి గుర్తింపు కోసం తాపత్రయపడడం ఆయన నైజం కాదు. "ఈ శతాబ్దానికి చెందిన ఒక గొప్ప వైద్య ఆలోచనాపరుడు" అని సుబ్బారావు చనిపోయినప్పుడు ఆయన నుద్దేశించి హెరాల్డ్ ట్రిబ్యూన్ వ్యాఖ్యానించింది. వైద్య రంగంలో యల్లాప్రగడ సుబ్బారావు స్ఫూర్తి మంతమైన కృషినీ, విజయాలనూ నేటి తరం యువతకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తెలుగు సంస్కృతికి ప్రతీక సంక్రాంతి




యుగయుగాలుగా, తరతరాలుగా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తున్న క్షీర ధార హైందవ సంస్కృతి. ఆ పాల వెల్లువలో పెల్లుబికిన మీగడ తరగలే మన సాంప్రదాయాలు. హైందవ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచారాలకు "పండగ కేంద్ర బిందువు, పండుగలు శుభ సూచకాలు. ప్రతి కుటుంబంలో కష్ట నష్టాలను మరపించి, నూతనోత్సాహాన్ని కలిగిస్తాయి. పండగలు పురాణేతిహాస, రుతు సంబంధాలు, శీతోష్ణ స్థితుల, సామాజిక జీవన విధానాధారాలుగా ఏర్పడ్డాయి. ప్రతి పండగలో పరమార్థం ఉన్నందునే అవి సాంప్రదాయాలుగా మారాయి. డోలు సన్నాయి వాద్యాలు, వాటి రాగాలకు అనుగుణంగా విన్యాసాలు చేసే అలంకృత గంగిరెద్దులు, హరిలో రంగ హరీ అంటూ, నడినెత్తి నుండి నాసిక దాకా తిరుమణి శ్రీచూర్ణ పట్టెలతో, కంచు గజ్జెలు ఘల్లు ఘల్లుమనగా, బోడి తలపై రాగి అక్షయపాత్ర కదల కుండా, చిందులు తొక్కే హరిదాసులు, అడుగడు గునా ముంగిళ్లలో రంగుల ఆకృతులు, భోగిమం టలు, కొన్ని ప్రాంతాలలో కోడి పందాలు, బొమ్మల పండుగలతో కలబోసిన గ్రామీణ సుందర మనో హర దృశ్యాలు తెలుగు వారికే ప్రత్యేకమైన సాంప్ర దాయ ప్రతీకలు. చాంద్రమానం" పాటించే తెలుగువారు "సౌరమానం" ప్రకారం జరిపే పండుగ సంక్రాంతి", "తత్ర మేషాదిషు ద్వాదశ రాశి క్రమ కేశు సంచరత: సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తర: రాశౌ సంక్రమణ ప్రవేశ: సంక్రాంతి". మేషం మొదలైన 12 రాశులలో సంచరించే సూర్యుడు ముందున్న రాశి నుండి తరువాతి రాశిలోనికి ప్రవేశించడమే సంక్రాంతి.సంక్రాంతి అంటే మారడం, చేరడం అని అర్థం. కర్కాటకం నుంచి మకర సంక్రాంతి వరకు సూర్యుడు దక్షిణాభి ముఖంగా సంచరించడం వల్ల ఈ కాలాన్ని 'దక్షిణాయణం' అంటారు. మకర సంక్రాంతి నుంచి కర్కాటక సంక్రాంతి వరకు ఉత్తరాభి ముఖుడై సంచరించడం వల్ల ఈ కాలాన్ని 'ఉత్తరాయణం' అని అంటారు. దేవతలకు ఉత్తరాయణం ఉత్తమ కాలమని, దక్షిణాయణం పితృదేవతలకు ముఖ్య కాలమని భావిస్తారు. ఉత్తరాయణంలో మరణిస్తే మోక్షప్రాప్తి కలుగు తుందంటారు. అందుకే అంపశయ్యపై భీష్మా చార్యుడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చే వరకు వేచి ఉన్నాడని మహా భారతం చెబుతోంది. మూడు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి సంబరాలలో మొదటిది భోగి పండగ. ఇతర పండుగల వలె తిథి ప్రధానము అయినది కాదు. ఇది ధనుర్మాసానికి, దక్షిణాయనానికి ఆఖరు రోజు. మకర సంక్రమణానికి పూర్వపు రోజు. గోదాదేవి తిరుప్పావై రచన పూర్తి చేసిన ముప్పయవ నాడు రంగ నాథుడు ప్రత్యక్షమై అమెను వివాహమాడతానని, సకల భోగాలు సమకూరుస్తానని చెప్పి, వివాహమాడగా, వివాహ తంతు పూర్తికాగానే ఆమె స్వామి వారిలో ఐక్యం పొందుతుంది. అందుకే "భోగి" అని ఈ పర్వమానికి పేరు. జన సామాన్యానికి భోగ భాగ్యాలు ఇచ్చే రోజని ప్రతీతి. భోగినాడు మేఘాధిపతి యైన ఇంద్రపూజు చేయడం ఆనవాయితీ. బలి చక్రవర్తి అణగిన దినంగా చెపుతారు. భోగి నాడు భోగి పీడ నివారణ, తెల్లవారగనే అభ్యంగన స్నానం చేయడం, విధాయక కృత్యం. చంటిపిల్లలకు తలంటు పోసి, భోగి పళ్ళు పోయడంతో దృష్టి పరిహారం చేస్తారు. కొత్త బట్టలు కట్టి, కుర్చీలో కూర్చుండ చేసి, రేగు పళ్ళు, పైసలు, చెరుకు ముక్కలు, బోడికలు దిగువార బోస్తారు. ధనుర్మాసం నెల రోజులు ఆడపిల్లలు తయారు చేసిన గొబ్బి పిడకలు చేయడం, తెల్లవారగట్లు భోగిమంటలు చేయడం ఆచరిస్తారు. మకర సంక్రాంతి సూర్యుడు ఉత్తర గతుడు కావడం త ఉత్తరాయణ ప్రవేశమవుతుంది. ఉత్తరాయణం దేవతలకు అర్హమైన కాలం, ఈ అయనంలో మృతి చెందిన వారు పుణ్యాత్ములై, సూర్య సాయుజ్యం పొందగలరని వేద వచనం. సూర్య సంచారమును బట్టి ఏర్పడిన పండుగ. ఆడపిల్లలు తెల్లవారు జామున లేచి పెట్టే గొబ్బిల్లు, ఆర్ష కర్మలలో ప్రాముఖ్యం కలిగిన కళా భిజ్ఞత ఉట్టిపడే ముగ్గులు, పళ్ళ నైవేద్యాలు, బాజా భజంత్రీల వాద్యాలు, ఎక్కడ చూసినా ఈనాడు దర్శనమిస్తాయి. రెండవ నాడు జరిపే మకర సంక్రాంతి అత్యంత పురాతనమైనది. సంక్రాంతి నాడు గంగలో స్నానం చేసి, బ్రాహ్మణునికి పెరుగు దానం చేయాలనే నియమాన్ని పాటించిన యశోదకు కృష్ణుడు జన్మించాడని దుర్వాసముని ద్వారా వివరింపబడి, ఆయన సూచనపై ద్రోణాచార్యుని సతి కృపి, సంక్రాంతి పర్వాన్ని జరిపి, పెరుగు దానం చేయడం ద్వారా అశ్వత్థామకు జన్మనిచ్చినట్లు పురాణ కథనం. ఈ సందర్భంగా నువ్వుల ముద్దలతో నలుగు పెట్టుకుని, తలంటి స్నానాలు చేసిన ముత్తయిదువలు, అలంకృతులై, ఐదు మట్టి ముంతలు పుచ్చుకుని, ఒక్కొక్క ముంతలో బియ్యం, పప్పు దినుసులు, చెరుకు, క్యాబేజీ ముక్కలు, రేగుపళ్ళు, నువ్వులు ఉంచి, మూకుడు మూతతో ఉంచి, ఎరిగిన వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి ఇస్తారు. నువ్వులతో చేసిన భక్ష్యాలతో భోజనం చేస్తారు. చిన్నపిల్లలకు మిఠాయి ఉండలు, రేగు పళ్ళు పంచుతారు.మకర సంక్రాంతినాడు రాముని పూజచేసి ఉపవాసం ఉండాలని చతుర్వర్గ చింతామణిలో ఉంది. ఈనాడు సూర్యుని ఆరాధించి, తిలలు, కూష్మాండాలు, భాండాలు, కంబళి, ధా న్యాలు, లోహాలు, వస్త్రాలు, తైల దీపాలను దానం చేయాలని శాస్త్ర వచనం. భోజనానికి బంధు మిత్రులను ఆహ్వానించడం, నగలతో అలంకరించుకుని నూతన వస్త్ర ధారణ గావించిన ముత్తయిదువలు పంచదారలో నువ్వులు కలిపి చిమ్మిలి చేసి, పంచి పెడతారు. సంవత్సరం పొడువునా, స్నేహితులై ఉండాలని ఆకాంక్షిస్తూ, శుభ, సుఖ ప్రదం కావాలని దీవనలను పెద్దవారి నుండి పొందడం ఆచారం. ఇక చివరిది కనుమ పండుగ. అధర్వణ వేదంలో దీనిని వృషభోత్సవమని పేర్కొన్నారు. ముందు సంక్రమణం పెళ్ళిన మరువాడు పశువులకు చేసే పండగ ఇది. కనుమ నాడు మినుములు తినాలట..కనుమనాడు మినుములు తినాలని, లేకపోతే యముడు ఇనుము కొరికిస్తాడని పెద్దలు అంటారు. కొన్ని ప్రాంతాల్లో కనుమనాడు తమ గ్రామ దేవతలకు నైవేద్యాలను సమర్పించే ఆచారం ఉంది. పురుషులు గ్రామ పొలిమేరల్లో కోడి పందాలు, పొట్టేళ్ల పందేలు జరుపుతారు..కనుమ రోజున ప్రయాణం పెట్టుకో కూడదని అంటారు. వెళ్తే వెంటనే తిరిగి రావడం కుదరదని ప్రతీతి. కనుమ నాడు కాకి కూడా ఎక్కడకీ బయల్దేరదనే సామెత. కనుమునాడు గోపూజ చేయడం కొన్ని చోట్ల కనిపి స్తుంది. ఆవులను, దూడలను, ఎడ్లను, శుభ్రంగా కడిగి, కొమ్ము లకు ముఖానికి పసుపు రాచి, కుంకుమ పెడతారు. అలంకరణార్థం కుచ్చులు, కొత్త కట్టు తాళ్ళు పెడతాడు. వీధుల వెంట ఊరే గిస్తారు. పశువుల శాలలను శుభ్రపరిచి మామిడాకులు కట్టి, పూలతో అలంకరిస్తారు. సాయం కాలం పొంగిలి నైవేద్యాన్ని పశువుల శాల వద్ద పెడతాడు. పవిత్రోదకం చల్లుతారు. పంటలు పండించే భగవంతునికి పొలాలను దున్నే ఎద్దులకు కృతజ్ఞత తెలిపే పర్వం సంక్రాంతి యనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలుగు వారికి ఇష్టమైన సంక్రాంతి సంబరాలకు తెలుగు నేల సిద్ధమవుతున్నది.

# పురాణ పురుషులు మల్లాది

ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే. ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధా నాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిం దే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ద ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి.మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారా వ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్ర దాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్ష సంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచు కున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు. తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వ్మాయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్లారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి,స్వాముల వారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్పావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరూ తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవ శాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం. వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుం డడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టు బట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహు ళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖర శాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా-లక్ష్మీ అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతో త్తములు చంద్రశేఖర శాస్త్రి... 96 ఏళ్ళ వయసులో జనవరి 14, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

# పేద ప్రజలకు ఇచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వ స్థలాలలో జరిగిన అవినీతి,అవకతవకలపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరపాలి




**చంద్రబాబు పేద ప్రజలకు రెండు సెంట్లు ఇంటి స్థలాలు,ఇంటి నిర్మాణానికి 4 లక్షలు ఎప్పుడు ఇస్తారు: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్**

**గుంతకల్లు జనవరి 13 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజలకు పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలాలు,ఇంటి నిర్మాణానికి 4 లక్షలు ఇస్తామని అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్న పేద ప్రజలకు ఇంటి స్థలాలు, నిర్మాణానికి నాలుగు లక్షలు ఎప్పుడు ఇస్తారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. సోమవారం పట్టణం లోని దోనుముక్కల రోడ్డులో పేదలకు ఇచ్చిన లేఅవుట్ల ను సిపిఐ ప్రతినిధి బృందం పరిశీలించినది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలో గతంలో కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇల్లు పేరుతో వేల పట్టాలు ఇచ్చారు. 2014- 2019 మధ్యలో తెలుగుదేశం ప్రభుత్వంలో రైల్వే లైను కు ఇరువైపులా ఉన్న పేదలకు, మరియు మున్సిపల్ స్థలాల్లో ఉన్న పేదలను ఖాళీ చేయించాలని పట్టాలు వేల లోనే ఇచ్చారు. ఈ పట్టాలు ఇవ్వడానికి భూములు కొనుగోలు చేయడానికి వందల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఇచ్చినది. ఈ ప్రకారంగా పదివేల పట్టాలపై నే పేదలకు పట్టాలు ఇచ్చిన ట్లు ప్రభుత్వం రికార్డులలో ఉన్నాయి. కానీ ఈ పట్టాలు నిజమైన పేదలకు అందలేదు. అధికారంలో ఉన్న వారి అనుచరులకు ఈ స్థలాలు అన్ని చేరినాయి. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల యందు సకాలంలో ఇల్లు నిర్మాణానికి నిధులు ప్రభుత్వం విడుదల చేయక, ఇచ్చిన స్థలం (1 ఒక సెంటు)తక్కువ కాబట్టే ఇల్లును నిర్మించక లేకపోయారు. జగన్ ప్రభుత్వంలో నే 3464 మందికి పట్టాలిస్తే, కేవలం 1.196 మంది మాత్రమే పూర్తిగా ఇల్లు నిర్మించుకున్నా రని, మిగిలిన వారు ఇల్లు నిర్మిచూపుకోలేదని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. కానీ ఇంటి నిర్మాణాలకు మాత్రం 39 కోట్ల 90 లక్షల 40 వేల 906 రూపాయలు పేదలకు ఇచ్చినట్లు హౌసింగ్ రికార్డులో తేలుతున్నాయి, మరి ఇదే నిజమైతే 3464 మంది ఇల్లు ఎందుకు నిర్మించుకోలేదు. కావున ఇలాంటి అవకతలు,అవినీతి వీటిలో చోటు చేసుకుంది, తక్షణమే రెవెన్యూ,మున్సిపల్ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రభుత్వ రికార్డులలో ఉన్న పేదల చేతిలో ఇళ్ల స్థలాలు ఉన్నాయా? లేక గతంలో అధికారంలో ఉన్న వారి అనుచరుల చేతిలో ఉన్నాయా? విచారణ చేపట్టాలని జగదీష్ డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్ర స్వామి,పట్టణ కార్యదర్శి గోపీనాథ్, కార్యదర్శి గౌస్,మండల కార్యదర్శి రాము రాయల్, ఏఐటియుసి మండల అధ్యక్షులు తలారి సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, ప్రజానాట్యమండలి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# భోగి మంటలలో విద్యుత్ బిల్లుల దహనం: సిపిఎం




**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి :** ఈరోజు గుంతకల్ పట్టణంలో కమిటీల ఆధ్వర్యంలో 33 చోట్ల పెరిగిన విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు డి శ్రీనివాసులు,మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీభాగంగా తమ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచుకోమని హామీ ఇవ్వడం జరిగింది కానీ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ చార్జీలు రకరకాల పేర్లమీద ప్రజల మీద భారాల మోపడం జరుగుతుంది. విద్యుత్ చార్జీలు దీనికి తోడుగా నిత్యవసర ధరలు కూడా ఆకాశాన్ని అంటే పరిస్థితి కనపడుతున్నాయి కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెరిగిన విద్యుత్ ఛార్జీలను నిత్యవసరదారులను తగ్గించాలని సిపిఎం పార్టీగా కోరుతున్నాం లేని పక్షంలో రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిస్తామని తెలియజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ ,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, సురేంద్రబాబు, రంగమ్మ పట్టణ కమిటీ సభ్యులు చంద్రన్న, షబ్బీర్,అబ్దుల్లా, సూరి , వీరేష్,షాష, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# ఫాదర్ ఫెర్రర్ జిల్లాకు చేసిన సేవలు వెలకట్టలేనివి

**ఉద్యోగస్తుల ఐక్యతకు క్రికెట్ టోర్నీ**

**ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగస్తులు క్రికెట్ టోర్నీ ప్రారంభం**

**మచ్చా రామలింగారెడ్డి అధ్యక్షులు వెటర్న్ క్రికెట్ అసోసియేషన్**




**గుంతకల్లు జనవరి 13 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** అనంతపురం జిల్లాకు ఫాదర్ ఫెర్రర్ విద్య, వైద్య, క్రీడా రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఆయన పేరు మీద ఉద్యోగస్తులందరినీ ఒక వేదిక మీదకు తెచ్చి ఉద్యోగుల ఐక్యత కోసం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి అన్నారు. వెట్రన్స్ క్రికెటర్ అసోసియేషన్ ఏపీ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫాదర్ ఫెర్రర్ జిల్లా స్థాయి ఉద్యోగస్తుల క్రికెట్ ఆరో రౌండ్ పోటీలను సోమవారం ఆర్డిటి మైదానం నందు మచ్చా రామలింగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు ఈ సందర్భంగా సభకు విజయరాజు కార్యదర్శి అధ్యక్షత వహించారు కార్యక్రమంలో రఘు, శంకర్, నాయక్, లాయర్ జయరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు రాయదుర్గం ఆర్టీసీ జట్టు లాయర్స్ జట్ల మధ్య పోటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో ఉన్న ఉద్యోగస్తు లకు ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా ఆటవీడుపుతోపాటు వారిలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఉపయోగపడు తుందని అన్నారు. అనంతరం రాయదుర్గం ఆర్టీసీ జట్టును లాయర్స్ జట్టుని మచ్చా రామలింగా రెడ్డి పరిచయం చేసుకొని ఫాదర్ ఫెర్రర్ టోర్నమెంటుని ప్రారంభించా రు. రెండు జట్లను పరిచయం చేసుకున్నా అనంతరం మచ్చా రామలింగారెడ్డి బ్యాటింగ్ చేసి మ్యాచ్ ను లాంఛనంగా ప్రారంభించారు.

## నిరుపేదలకు బట్టలు పంపిణీ

**పొందూరు , జనవరి 12 :** సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని పొందూరు మండల కేంద్రంలో పట్టుశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు మలిపెద్ది శ్రీరంగ నాయకులు , సెక్రటరీ పాలి శెట్టి సూర్య ప్రకాష్ , కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిరుపేదలకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలిశెట్టి సూర్యం ,పాలి శెట్టి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం వారి మనుమలు పాలి శెట్టి ఆనంద రావు ,వారి అబ్బాయిలు పాలిశెట్టి సూరజ్, పాలిశెట్టి ధీరజ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పట్టుశాలి కులానికి చెందిన నిరు పేద మహిళలు 112 మందికి చీరలు , పురుషులకు పంచి, తువ్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టుశాలి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.




## నా ఆర్ఆర్ ఢీ డాన్స్ అకాడమీ నిర్వహించిన డాన్స్ ప్రోగ్రాంకు వచ్చేసిన గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ




**ప్రజా జ్యోతి గుత్తి రిపోర్టర్ కృష్ణ** గుత్తి పట్టణంలో ఆకట్టుకున్న రాష్ట్రస్థాయి డాన్స్ పోటీలు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఢీ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ సుదర్శన్ మాస్టర్ మరియు గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం సోదరుడు గుత్తి మండలం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ హాజరయ్యారు ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ గుత్తి పట్టణంలో ఇలాంటి డాన్స్ ప్రోగ్రాం పెట్టినందుకు అదేవిధంగా వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది అదేవిధంగా ఎంకే చౌదరి జక్కలచెరువు ప్రతాప్చికెన్ సిన గుమ్మనూరు నారాయణ కలిసి ఈ డ్యాన్స్ పోగ్రాంకు 1.00000 లక్ష రూపాయలు ప్రైజ్ మనీ ఇవ్వడం జరిగింది అనంతరం ఆర్ ఆర్ డాన్స్ అకాడమీకి చెందిన ఒక డాన్సర్ కొద్దిరోజుల క్రితం ప్రమాదవశాత్తు చెయ్యి ఫ్యాక్చర్ కావడంతో ఈ విషయం తెలుసుకున్న గుమ్మనూరు నారాయణ వారి కుటుంబానికి 20.000 వేల రూపాయలు ఆర్ ఆర్ డాన్స్ అకాడమీ రవి కి అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో డాన్సర్ స్ మరియు మాస్టర్లు గుత్తి మండలం ప్రజలు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు బిజెపి కార్యకర్తలు జనసేన సైనికులు పాల్గొన్నారు...

## జాతీయ స్థాయికి ఎంపికైన సైక్లింగ్ క్రీడాకారులకు సన్మానం



**గుంతకల్లు జనవరి 13 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** అనంతపురం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో 22-01-2025 తేదీ నుండి జరిగే జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు గుంతకల్లు పట్టణంలోని బి ఆర్ కె సంస్థ కార్యాలయం నందు క్రీడాకారులకు సన్మానం చేయడం జరిగింది. 2024 నెలలో విజయవాడలో జరిగిన 68 వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎం. నందిని అండర్ 19 బాలికల క్యాటగిరీ లో బంగారు పథకము సాధించి,నేషనల్ సైక్లింగ్ పోటీలకు సెలెక్ట్ కావడం జరిగింది. అలాగే గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లవన్ కుమార్ అండర్ 19 బాలురు కేటగిరీలో ద్వితీయ స్థానం సాధించి నేషనల్ సైక్లింగ్ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. వీరికి సోమవారం అనంతపురం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సోమశేఖర్ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి పాండురంగ,సైక్లింగ్ అసోసియేషన్ ఫౌండర్ మల్లికార్జున,ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి,నారాయణ రెడ్డి, శ్రీనివాసులు,పుండరీకాక్ష, ఫిజికల్ డైరెక్టర్స్ అయూబ్ ఖాన్,సత్యనారాయణ, ఉపాధ్యాయులు మల్లికార్జు న, శంకర్ పాల్గొనడం జరిగింది.

## గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యంలో భోగి పండుగ అత్యంత వైభవంగా జరిగింది.




**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** ఈరోజు గుంతకల్లిశాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో.. గుంతకల్ ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి మరియు గుమ్మనూరు శ్రీనివాసులు మరియు ఎన్డీఏ కూటమి సభ్యులు లిబిజెపి టిడిపి జనసేన నాయకులు కలిసి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లో లిభోగి మంటలు వేసి కోలాటలాడుతూ భోగి పండుగ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందిలిఈ కార్యక్రమంలో నాయకులు బండారు ఆనంద్, తలాది మస్తాను, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, సప్లయర్ హనుమంతు , టిడిపి నాయకులు జనసేన నాయకులు బిజెపి నాయకులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# నియోజకవర్గ అభివృద్దే లక్ష్యం







**శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు**

**ప్రతీ ఇంటికి త్రాగునీరు అందిస్తాం**

**కింతలి లో నిరుపేదలకు బట్టలు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్**

**పొందూరు , జనవరి 12 :** ఆమదాలవలస నియోజవర్గ అభివృద్దే తన లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరు మండలం కింతలి గ్రామంలో సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని దుంపల వెంకట సత్యన్నారాయణ , లక్ష్మీకాంతం దంపతుల కుమారుడు, విశ్రాంత ఉపన్యాసకులు దుంపల సన్యాసి రావు జ్ఞాపకార్థం నిరుపేదలకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని బట్టలు పంపిణీ చేశారు. 2006 వ సంవత్సరం నుండి నిరుపేదలకు వస్త్రాలను పంపిణీ చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానంగా త్రాగునీరు , సాగునీరు సమస్యల పరిష్కారమే ద్యేయంగా పనిచేస్తున్నానన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అతి కొద్ది రోజుల్లోనే అనేక అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. అందులో భాగంగానే ప్రతీ గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతీ గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శరవేగంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఎక్కడిక్కడ మురికి నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా ప్రతీ గ్రామంలో కాలువలు , సీసీ రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కింతలి గ్రామ సర్పంచ్ పైడి రాం ప్రసాద్ , ఎంపీటీసీ కూటి కుప్పల హనుమంతు రావు ,పట్టణ తెలుగుదేశం కార్యదర్శి చిట్టి నాగభూషణం , విశ్రాంత ఆ. ఐ .%శీ% గవర గోవింద రావు, విశ్రాంత ఆ. జె.డి కరణం గోవింద రావు , శివాని ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు వెంటరావు , తెలుగుదేశం నాయకులు , కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఈనెల 20 న ఎస్సీ వర్గీకరణ కొరకు ఏర్పాటు చేసిన రంజన్ మిశ్రా అర్జీల స్వీకరణ కార్యక్రమానికి సమాయత్తం కండి

### ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్



**గుంతకల్లు జనవరి 13 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** ఎస్సీ వర్గీకరణ చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ను నియమించడం జరిగింది.కమిషన్ అనంతపురం జిల్లా పర్యటన లో భాగంగా అనంతపురం పట్టణం లోని కలెక్టర్ కార్యాలయం నందు ఏకసభ్య కమిషన్ ఈనెల 20 వ తేదీన ఎమ్మార్పీఎస్, దళిత ప్రజా సంఘాల నుండి వినతులు స్వీకరణ మరియు జిల్లాలోని మాదిగలు పడుతున్నా ఇబ్బందులు పై వినతులు స్వీకరణ కార్యక్రమం వుంటుంది ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా వ్యాప్తంగా సమాయత్తం చేసి వర్గీకరణ సక్రమంగా అమలు పరిచే భాగంగా గుంతకల్లు నియోజక వర్గం ఎమ్మెస్ పి, ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ సి. నరసింహులు మాదిగ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలోని అంబేద్కర్ నగర్ కమ్యూనిటి హాల్ నందు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ పాల్గొని ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ 30 సంవత్సరాలుగా మాన్య శ్రీ మందకృష్ణ మాదిగ పోరాటం చేసి వర్గీకరణ సాధించుకోవడం జరిగింది. ఇప్పుడు మన జాతి జాగ్రత్తగా వుండే అవసరం వుంది ఎందుకంటే కులగణన అనేది గత ప్రభుత్వంలో తప్పుల తడకగా చేయడం జరిగింది నిజమైన మాదిగల కు అన్యాయం జరిగే అవకాశం వుంది కాబట్టి ఈ నెల 20 వ తేదీన జరుగు రంజన్ మిశ్రా ఏక సభ్య కమిషన్ వినతుల కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గంలో ప్రతిగ్రామం నుండి మాదిగలు తరలిరావాలి తరలి వచ్చి స్థానిక సమస్యల పై వినతులు ఇవ్వవలసిందిగా కోరుచున్నారు.అలాగే దళిత సంఘాలను కూడా కోరుతున్నా ప్రతి ఊరువాడా కదిలిరావాలని పిలిపిస్తున్నా ను మనందరం ఎకం కావాలి అని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా రాయలసీమ దళిత సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు తగరం రామాంజనేయులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ మాదిగ, ఎస్సీ ఎస్టీ రక్షణ సమితి అధ్యక్షుడు ఎం.మహేంద్ర, ఎమ్మార్పీఎస్ మండల గౌరవ అధ్యక్షులు బాలాంజనేయు లు, ఎం ఈ ఎఫ్ నాయకులు రామాంజనేయులు, రంగస్వామి, బిజెపి నాయకులు కృష్ణమూర్తి, కేశవ, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు ఆనంద్, నాయకులు తలారి ఆనందరాజు, దాసరి రవికుమార్,శీన, కసాపురం గ్రామ అధ్యక్షులు మోహన్ రమేష్,జయరామ్,రాజు, చిన్న,శరత్ పవన్,ఎం.రాజు, ఫక్కీరప్ప, శేఖర్,మండల కన్వీనర్ కున్నీ,పామిడి మండలాధ్యక్షుడు లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానంలో

# చివరి ధనుర్మాసం వైభవంగా జరిగింది.





**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** భగవంతుడి మనసు గెలిచిన భక్తురాలు ప్రేమ కథ భోగి రోజున ఇది చూస్తే జీవితమంతా కసాపురం స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీశ్రీశ్రీ గోదాదేవి రంగనాథుల కళ్యాణ మహోత్సవం వైష్ణవ ఆలయాల్లో జరిగే కళ్యాణ వేడుకల్లో తిలకించేందుకు రెండు కళ్ళు సరిపోవు శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానంలో వైభవంగా జరిగినది ఉభయ దారులెన గాది కృష్ణవేణి ఉమా శంకర్ వారిదంపతులు ఆలయ ధర్మకర్త తలారి శకుంతలమ్మ పరుశురాముడు దంపతుల చేతుల మీదుగా ఆలయ అర్చకులు నందకిషోర్ రాకేష్ చెన్నకేశవ స్వామి నేతృత్వంలో ధనుర్మాసంలో చివరి రోజు ఈరోజు ఎంతో విశేషమైనటువంటి రోజు సీతమ్మ కానీ పద్మావతి అమ్మవారు కానీ భగవంతుని తన వంటి కదలే రూపంలోనే వివాహమాడారు వారి అవతారాల్లో కానీ గోదాదేవి మానవ కన్యగా ఉంటూ విగ్రహ స్వరూపుడైన శ్రీ రంగనాథుని వివాహమాడింది గోదాదేవి కళ్యాణం తన ఆదరణ విగ్రహ స్వరూపమైన భగవంతుని కదిలేటట్టు చేసుకుంది అదే అమ్మవారి యొక్క గొప్పతనం మన ఎదురు గుండా కనిపించే విగ్రహాన్ని అదే దైవమని విశ్వసించే మనం చెప్పినట్లుగా మన పిలిచినట్లుగా అది కదిలేలా చేసుకున్న ఆండాలు తల్లి నిరూపించింది 110 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పౌర్ణమి రోజున దేవస్థానంలో ఇంతటి పవిత్రమైన కళ్యాణం జరగడం భక్తులు అందరూ ఆనంద ఉత్సవాల్లో అంగరంగ వైభవంగా కమనీయంగా జరిగినది వైకుంఠ ఏకాదశి సేవకు వచ్చిన గరుడ సేన జనార్ధన్ మంజు సత్య వారి మిత్ర బృందానికి అక్షయపాత్ర శాలువాతో సన్మానించడం జరిగినది ఈ కార్యక్రమంలో రామలింగ, ఆలయ ట్రస్ట్ వారు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భక్తుల కోరికలు తీర్చే భోగేశ్వర స్వామి పామిడిలో వెలిసిన దేవస్థానం



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** పామిడి పట్టణం లోని పురాతన భోగేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిట లాడింది. పౌర్ణమి, సోమవారం, ఆరుద్ర నక్షత్రం, భోగి పండుగలు కలిసిరావడం తో అభిషేకాలు, అర్చనలు చేయుంచుకున్నారు. అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం చేశారు. అందులో భాగంగా పంచామృతాలు, సుఘంద ద్రవ్యాలు, రుద్రాక్ష, బిల్వ, జల, అభిషేకాలు చేశారు. అనంతరం అష్టోత్తర శతనామవళి పుష్పర్చన చేశారు. నవవిధ మంగళ హారతులు గవించారు. తీర్థ ప్రసాదాలు అందించారు

## ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి. సిపిఎం.





**పోడూరు, పెనుగొండ జనవరి 13,** ప్రజాజ్యోతి న్యూస్. కరెంట్ బిల్లులు పెరిగి రావటంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు పెరుగుతున్నాయి. కరెంటు బిల్లులు పెంచకుండా,నాణ్యమైన విద్యుత్తు అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంతో పెనుగొండ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. సోమవారం పెనుగొండ, వడలి, సిద్ధాంతం, చిన్నమల్లం, తామరాడ, సోమరాజు చెరువు గ్రామాల్లో సిద్ధాంతం కరెంట్ ఆఫీస్ కాలనీ లో సిపిఎం పార్టీతో ప్రజలు భోగిమంటల్లో పెరిగిన విద్యుత్తు బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండలంలో పలు గ్రామాల్లో ప్రజలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగింపును వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, మహిళా సంఘం నాయకురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ



**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** భారతీయ జనతా యువమోర్చా పట్టణ శాఖ అధ్యక్షుడు కరాటే రవి తేజ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గుంతకల్ లో ఉన్నటువంటి విశ్వహిందూ పరిషత్ బాలల అనాధ ఆశ్రమం మరియు వృద్ధాశ్రమంలో మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ బండారు కృష్ణమూర్తి మాట్లాడుతూ కేవలం కుటుంబంతోనే కాకుండా ఇటువంటి అనాధాశ్రమాల్లో వృద్ధాశ్రమాల్లో వారితో కలిసి పండుగ చేసుకోవడం వారికి కూడా మానసికంగా బలాన్ని ఇస్తుందని కావున భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని %దీజీవీ% నాయకులన అభినందించారు ఈ కార్యక్రమంలో నమామి గంగే రాష్ట్ర కోకన్వీనర్ కొలిమి శేకన్న సీనియర్ భారతీయ జనతా పార్టీ నాయకులు బిజెపి రంగన్న మాజీ పట్టణ అధ్యక్షులు పట్నం రామాంజనేయులు యు మోర్చా జిల్లా అధ్యక్షులు మంజుల వెంకటేష్ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసముద్రం శ్రీదేవి బీజేవైఎం జిల్లా కార్యదర్శి మొండ్ల కేశవ ఉపాధ్యక్షులు రవీంద్ర లింగేశ్వర్ చక్రపాణి. రాజశేఖర్ భాగ్యరాజ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

## ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలంటూ భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసిన సిపిఎం నేతలు.



**పోడూరు, జనవరి 13, ప్రజాజ్యోతి న్యూస్.** ట్రూ %శీట% చార్జీలు వెంటనే రద్దుచేయాలని సిపిఎం పోడూరు మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలంలోని పోడూరు, పండితవిల్లూరు, తూర్పుపాలెం పలు గ్రామాల్లో సోమవారం భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కరెంట్ బిల్లులు ఎక్కువ రావటంతో ప్రజల్లో ఆగ్రహం చెందుతున్నారని అన్నారు. పెరుగుతున్నాయి. కరెంటు బిల్లులు పెంచకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంతో కాలనీ లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు భోగిమంటల్లో పెరిగిన విద్యుత్తు బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారన్నారు.పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండలంలో పలు గ్రామాల్లో ప్రజలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగింపును వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నేతలు బూరాబత్తుల వెంకట్రావు, బొంతు శ్రీను, మూడే మోజేష్, కే భాస్కరరావు పాల్గొన్నారు.

# పండుగ వేళ నిరుపేదలకు వస్త్రదానం





**పేదల మొఖాల్లో ఆనందం నింపుతున్న పివీ ఎస్ రామ్మోహన్ ఫౌండేషన్**

**రెండు దశాబ్దాలుగా నిరుపేదలకు బట్టలు పంపిణీ**

**వెయ్యి మందికి పైగా వస్త్రదానం**

**జి సిగడాం , జనవరి 13 :** గత రెండు దశాబ్దాలుగా పివిఎస్ రామ్మోహన్ ఫౌండేషన్ పండగ వేళ పేదల మొఖాల్లో ఆనందాన్ని నింపుతూ తమ దాతృత్వాన్ని చాటుకుంది. ఈ సంస్థ చొరవ తో సంక్రాంతి వచ్చిందంటే చాలు దవలపేట గ్రామం తో పాటు పరిసర గ్రామాలలో నూ పండగ వాతావరణం నెలకొంటుంది. తొలుత ఒక గ్రామం తో మొదలైన వీరి బట్టల పంపిణీ ఇప్పుడు అనేక గ్రామాలకు విస్తరించింది. వేలాది మందికి ఉచితంగా వైద్యం అందించడం తో పాటు పిల్లలను చదివించేందుకు , ఆర్థికంగా సహాయం అందించేందుకు పి.వీ.ఎస్ రామ్మోహన్ ఫౌండేషన్ ప్రతినిధులు సంక్రాంతి పండుగ కు మాత్రం జి సిగడాం మండలం దవలపేట గ్రామానికి చేరుకుంటారు. భోగ భాగ్యాలు ప్రసాదించే భోగి పండుగ రోజే

పివీఎస్ ఫౌండేషన్ చైర్మెన్ పేడాద రామ్మోహన్ ,తన సతీమణి ,ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పేడాద సుజాత , ప్రముఖ ఛార్టర్డ్ అకౌంటెంట్ పేడాద శేఖర్ , పివీఎస్ భార్గవ శంకర్ , పివీఎస్ తేజేంద్ర శంకర్ చేతుల మీదుగా భారీ ఎత్తున వస్త్రదానం కార్యక్రమాన్ని చేపట్టారు. వెయ్యి మందికి పైగా బట్టలు పంపిణీ చేసి గ్రామస్తుల మన్నలను పొందారు. తండ్రి పేడాద వెంకటస్వామి ఉన్నప్పుడు మొదలుపెట్టిన ఈ కార్యక్రమం ఆయన సజీవంగా లేకపోయినా తన తండ్రి ఆశయాన్ని కుమారులు కొనసాగిస్తున్నారు. ప్రతీ ఒక్కరూ సమాజ సేవలో ముందుండాలని పి వి ఎస్ ఫౌండేషన్ చైర్మెన్ పి.వి.ఎస్ రామ్మోహన్ అన్నారు. గత 20 ఏళ్లుగా ప్రతీ ఏటా వస్త్రదానం చేపడుతున్నామని , సమాజానికి సేవ చేయడంలో సంతృప్తి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దవలపేట గ్రామ ప్రజలతో పాటు ఇతర గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహోన్నత కార్యక్రమంలో కంచి కామాక్షి సేవా సంఘం





**నిరుపేదలకు బట్టలు పంపిణీ**

**ముఖ్య అతిధులుగా స్థానిక సర్పంచ్ రేగిడి లక్ష్మీ , టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ**

**పొందూరు , జనవరి 13 :** గత 15 ఏళ్లుగా శ్రీ కంచి కామాక్షి సేవా సంఘం నిరుపేదలకు బట్టలు పంపిణీ చేస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంది. పేదలు సంక్రాంతి పండుగను మరింత ఆనందోత్సవాల మధ్య జరుపుకునేందుకు సోమవారం నాడు భోగి పండుగ సందర్భంగా పొందూరు మండల కేంద్రంలో అగ్రహారం వీధిలో వెలసియున్న శ్రీ కంచి కామాక్షి ఆలయ ప్రాంగణం వద్ద కంచి కామాక్షి సేవా అధ్యక్షులు , ఆలయ కమిటీ చైర్మన్ సింహాద్రి ధనుంజయ రావు ఆధ్వర్యంలో కామాక్షి భారీ ఎత్తున బట్టలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మీ , మాజీ సర్పంచ్ ,టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ ముఖ్య అతిధులుగా హాజరైయ్యారు. ముందుగా వారు ప్రజలందరికీ భోగి , సంక్రాంతి ,కనుమ శుభాకాంక్షలు తెలియజేస్తూ పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం అనకాపల్లి విజయలక్ష్మీ , రేగిడి లక్ష్మీ మాట్లాడుతూ ప్రతీ ఏటా నిరుపేదలకు బట్టలు పంపిణీ కార్యక్రమం చేపట్టడం ఒక గొప్ప విషయమన్నారు. సమాజానికి అందించే సేవలో ప్రతీ ఒక్కరికీ సంతృప్తి ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండి, సమాజ సేవలో , ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొండపల్లి సూర్యనారాయణ , తరిణి ఉమామహేశ్వర రావు , ముందూరు కోటేశ్వర రావు , తరిణి నాగేశ్వర రావు , చిట్టూరి చంద్ర రావు , సాతివిల్లి దుర్గా ప్రసాద్ , కొండపల్లి మధు , గిడిజాల భాస్కర రావు , తరిణి సురేష్ కుమార్ , వెంకటేష్ , శ్రీనివాస రావు , కంచి కామాక్షి ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంతోషాల సంక్రాంతిని ప్రజలు ఆనందంగా జరుపుకోవాలి

**మండల ప్రజలకు శుభాకాంక్షలు**

**తెలిపిన వైకాపా కేడర్ నాయకులు**



**పొందూరు , జనవరి 13:** రైతుల పండుగ సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని పొందూరు మండల ప్రజలకు వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ , జెడ్పీటీసీ లోలుగు కాంతారావు , పి.ఎ.సి.ఎస్ మాజీ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి , పి. ఎ.సి.ఎస్ మాజీ డైరెక్టర్ చింతాడ సత్యప్రసాద్ , జిల్లా ఉద్యోగుల మరియు పెన్షనర్ల విభాగం అధ్యక్షులు పప్పల రాధాకృష్ణ , పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు , ఎ.ఎం.సి మాజీ చైర్మెన్ బాడాన సునీల్ ,జిల్లా మహిళా జాయింట్ సెక్రటరీ కూన రమణమ్మ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఈ సంక్రాంతి పండుగ ప్రతీ ఒక్కరి జీవితంలో సంతోషాన్ని నింపాలని అన్నారు. పంటల రాశులలో ఇల్లు కళకళలాడుతూ ,ప్రతీ రైతు జీవితంలో సంక్రాంతి శోభ సంతరించుకోవాలని ఆకాంక్షించారు. మండల ప్రజలు ఆనందోత్సవాల మధ్య పండుగను కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని తెలిపారు.

# తిరుమాలిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ప్రత్తిపాడు ప్రజాజ్యోతి రిపోర్టర్ శ్రీను** సంప్రదాయ సంక్రాంతి పోటీల్లో భాగంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామంలో ముగ్గుల పోటీ నిర్వహించారు ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఇన్చార్జి వరుపుల తమ్మయ్యబాబు జిల్లా కార్యదర్శి పెంటకోట మోహన్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.గ్రామ జనసేన నాయకులు కోరుకొండ అప్పారావు,కోలా వీరబాబు కోరుకొండ శ్రీను మాగాపు రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలలో 38 మంది మహిళలు చిన్నారులు పాల్గొన్నారు న్యాయ నిర్ణయేతల సమక్షంలో ఎంపిక చేపట్టారు.ప్రధమ ద్వితీయ తృతీయ విజేతలకు నాయకుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు ప్రధమ బహుమతి మగాపు సరోజకు నాలుగు తులాల వెండి గ్లాసు కోరుకొండ అప్పారావు బహుకరించగా ద్వితీయ బహుమతి దాడిశెట్టి నందినికి మూడు తులాల వెండి గ్లాసు కోలా వీరబాబు బహుకరించారు తృతీయ బహుమతి లోలగల సుహాసినికి అందజేశారు.పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా వరుపుల తమ్మయ్య బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామాలలో సాంప్రదాయ సంక్రాంతి జరుపుకోవాలని అన్నారు ఈ ముగ్గుల పోటీలు ద్వారా మహిళలు చిన్నారులు



మరింత ఉత్తేజంగా సంక్రాంతి వాతావరణం తీసుకొచ్చారని ఈ సందర్భంగా అన్నార ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగ సంతోషంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణయేతలు సుబ్బారావు, నూకరాజు ఈశ్వరరావు రాము జనసేన నాయకులు వరుపులు సాయికిరణ్ ఇంద్రయ్య కోరుకొండ శ్రీను కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు

## సంక్రాంతి సంబరాలు షూటింగ్ కార్యక్రమానికి కెమెరా స్విచ్ ఆన్ చేసిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ





ఆచంట మండలం వల్లూరు గ్రామం మట్టపర్తి పాలెం లో సలనా ప్రొడక్షన్స్ వారి సంక్రాంతి సంబరాలు షూటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు శ్రీ పితాని సత్యనారాయణ హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. సంక్రాంతి సంబరాలు షూటింగ్ కార్యక్రమానికి దర్శకత్వం వహిస్తున్న పవన్ బోళ్ళ రోలింగ్ చెప్పగా సలనా ప్రొడక్షన్స్ నిర్మాతగా వ్యవహరిస్తున్న సిద్ధార్థ ప్రగతి సంస్థల చైర్మన్ డాక్టర్ నాగయ్య యాక్షన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచంట జడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు,టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొడవర్తి శ్రీరాములు, టిడిపి ఆచంట మండల అధ్యక్షులు కేతా మీరయ్య, టిడిపి గ్రామ అధ్యక్షులు దేవళ్ళ రమేష్, చిలుకూరి సీతారాం మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు





**గుంతకల్లు జనవరి 13 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** పట్టణంలో తిలక్ నగర్ కాలనీలో అయ్యప్ప మినరల్ వాటర్ ప్రోప్రైటర్ శ్రీనాథ్ సహకారం తో ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ ఆర్కే నాయుడు, ఐద్వా నాయకులు రంగమ్మ, చేతులు మీదుగా బహుమతులు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, చంద్ర, సాకే నాగరాజు, వినీత్,ధన ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



**గుంతకల్లు జనవరి 13 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు) :** అనంతపురం జిల్లా ప్రజలందరికీ, ముఖ్యంగా ఉరవకొండ నియోజకవర్గం ప్రజలందరికీ శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్,ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన తెలుగుజాతి సగర్వంగా జరుపుకునే అచ్చమైన తెలుగు పండగ సంక్రాంతి అని రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగు వాకిలన్నీ పండగ శోభాయమానంతో కళకళలాడుతూ అచ్చమైన తెలుగుదనం ఉట్టిపడేలా ఈ పండుగ అందరికీ శుభాలను చేకూర్చాలని పండగ సందర్భంగా బంధువులు, మిత్రులు, ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సంతోషంగా గడపాలని ముఖ్యంగా రైతులకు సకాలంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండి ఆనందంగా ఉండాలని వారికి ఆర్థికంగా కలిసి రావాలని ఆకాంక్షించారు.ఈ సంవత్సరం కూడా సంక్షేమ ఫలాలు అందరికీ చేరి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ అభివృద్ధిలోకి రావాలని ఆయన కోరుతూ ప్రతి ఒక్కరికి సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## సంస్కృతి , సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ

**వైసిపి అధికార ప్రతినిధి కోట గోవింద రావు**



**ఆమదాలవలస , జనవరి 13 :** తెలుగు సంస్కృతి , సాంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుందని శ్రీకాకుళం జిల్లా వైసిపి అధికార ప్రతినిధి కోట గోవింద రావు అన్నారు. సోమవారం ఆయన ఒక పత్రిక విడుల చేస్తూ నియోజవర్గ ప్రజలకు, వైసిపి నాయకులకు , కార్యకర్తలకు ,అధికార యంత్రాంగానికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాలలో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. రైతులకు ఇచ్చే గౌరవానికి ప్రతీక మకర సంక్రాంతి అని , ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా అన్నదాతల కష్టాలు తొలగి రైతులందరూ పాడి పంటలు సమృద్ధిగా పండి సుఖసంతోషాలతో , ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో తన తనయుడు వైకాపా పార్టీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి రైతుల సంక్షేమానికి గత ఐదేళ్ల పాలనలో ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజలందరూ ఆనందంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని తెలిపారు.

# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపిన జిల్లా పోలీసులు



**బాపట్ల జిల్లా ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్** సంక్రాంతి ముసుగులో జరిగే అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసి ఉద్దేశంతో జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు కోడిపందాలు జూదం ఇతర అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేసేందుకు సోమవారం విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు చీరాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఏస్ ఐ నాగ శ్రీను వారి స్టేషన్ సిబ్బందితో కలిసి కొత్తపేట ప్రసాద్ నగర్‌లోని ఒక ఇంటిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరం పై దాడి చేసి పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని వారి నుండి రూ.4320 నగదు సీజ్ చేసినారు ఇంకొల్లు ఎస్సై సురేష్ వారి స్టేషన్ సిబ్బందితో ఇంకొల్లు మండలంలోని పావులూరు గ్రామ శివారులలో కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరాలపై సోమవారం రైడ్ చేసి కోడి పందాలు ఆడుతున్న 6గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకొని రూ.1300 నగదు సీజ్ చేసినారు. వేటపాలెం మండల పరిధిలోని విఙ్ఞేశ్వర కాలనీలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు వారి సిబ్బంది పేకాట శిబిరం పై దాడి చేసి పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకొని వారి నుండి రూ.16,100 నగదును స్వాధీనం చేసుకున్నారు నగరం మండలం గాలి వారి పాలెం పొలాల నందు కోడిపందాలు నిర్వహిస్తున్నా 4 గురు వ్యక్తులను నగరం ఏస్ ఐ అదుపులోకి తీసుకున్నారు వారి వద్ద నుండి రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని మంతెనవారిపాలెం కొత్తపాలెం పిట్లవాని పాలెం గ్రామాల పరిధిలోని కోడిపందాల స్థావరాలపై చందోలు ఎస్సై స్వామి శ్రీనివాస్ వారి సిబ్బంది రైడ్ చేసి మొత్తం 7గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని 5 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. చుండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేటపాలెం గ్రామ శివారులలో కోడిపందాలు ఆడుతున్న వారిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుండి రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది అడవులదీవి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపట్నం మండలం దిండి పంచాయతీ కేశనవారిపాలెం గ్రామ పొలాలలో కోడిపందాలు నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుండి ఒక పందెంకోడిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని తూర్పు పాలెం పొలాల్లో రైడ్ చేయగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రెండు పంద్యం కోళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది కోడిపందాల స్థావరాలపై నిర్వహించిన దాడులలో మొత్తం 26 మందిని అదుపులోకి తీసుకొని 14 పందెం కోళ్లను స్వాధీన పరుచుకొని రూ.8,940 నగదు సీజ్ చెయ్యడం జరిగింది పేకాట స్థావరాల పై నిర్వహించిన దాడులలో 20 మందిని అదుపులోకి తీసుకొని రూ.20,420 నగదు సీజ్ చెయ్యడం జరిగింది సంక్రాంతి పండుగ ముసుగులో ఎవరైనా కోడిపందాలు పేకాట వంటి చట్ట వ్యతిరేక జూద క్రీడల్లో పాల్గొన్న నిర్వహించిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు

# సీఎం చంద్రబాబు పాలనతో సంక్షేమ స్వర్ణాంధ్ర ఆవిర్భావం









### రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పెనుకొండలో అంబరాన్ని తాకిన సంక్రాంతి సంబరాలు

**పెనుకొండ జనవరి 13:** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ సంక్షేమ స్వర్ణాంధ్రగా ఆవిర్భవిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ఒకవైపు సంక్షేమం అమలు చేస్తూనే మరోవైపు సంపద సృష్టికి అనేక పరిశ్రమలను సీఎం చంద్రబాబు తీసుకొస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో రైతులు సహా అన్ని వర్గాల ప్రజల్లోనూ ఆనందం నెలకొందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ సంక్షేమ స్వర్ణాంధ్రగా ఆవిర్భవిస్తోందన్నారు. ఓ ప్రశ్నకు మంత్రి సవిత సమాధానమిస్తూ, పనికిరాని వస్తువులను భోగి మంటల్లో వేయడం సాంప్రదాయమని, ఇప్పటికే ప్రజలు కొన్నింటిని మంటల్లో పడేశారని పరోక్షంగా వైసీపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

**నమ్మకం నిలబెట్టుకునేలా పాలన**

అంతకుముందు నిర్వహించిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తున్నామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినవిధంగా మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. తల్లికి వందనం పథకం కూడా అమలు చేయబోతున్నామన్నారు. రైతులకు అన్నివిధాలా మేలు కలిగేలా పాలన సాగిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం రాగానే రాష్ట్ర ప్రభుత్వం తరపున వాటా సాయం అందజేయనున్నట్లు తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ కింద త్వరలో పరికరాలు పంపిణీ చేయనున్నామని మంత్రి తెలిపారు. రెవెన్యూ సదస్సులు, పొలం పిలుస్తోంది, పల్లె పండుగ పేరుతో రాష్ట్రంలో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

**ఘనంగా సంక్రాంతి సంబరాలు**

జూనియర్ కళాశాల మైదానం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో నియోజక వర్గానికి చెందిన వేలాది మంది మహిళలు, యువకులు ఉత్సాహం పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. నాయకుల మధ్య టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. కోడిపందెలు, పొట్టేళ్ల తో పోటీలు, గాలిపతాలు వేగరవేయడం హరిదాసు కథలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలో గెలుపొందిన మొదటి బహుమతికి 10000 రెండో బహుమతికి 5000 మూడో బహుమతికి 3000 తో పాటు ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు ప్రదానం చేశారు. మహిళలు వేసిన ప్రతి ముగ్గునూ మంత్రి పరిశీలించి, అభినందలు తెలిపారు. మంత్రి సవిత స్వయంగా ఎద్దుల బండి నడిపారు. పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యావేత్త గొర్తి వెంకటస్వామికి డా. సర్వేపల్లి జాతీయ అవార్డు



**ంంఅనంతపురం, జనవరి 13:** అనంతపురం జిల్లాకు చెందినప్రముఖ విద్యావేత్త, రాయలసీమ ప్రజా సమాఖ్య అధ్యక్షులు గొర్తి వెంకటస్వామికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డు లభించింది. ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయనకు పురస్కార ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభకు కవి, జర్నలిస్ట్, ప్రజా కళావేదిక చైర్మన్ అరవ జయపాల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ రచయిత్రి, శ్రీవెంకటేశ్వర వైద్యకళాశాల సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రోజారమణి హాజరై అవార్డును అందజేశారు. అతిథులుగా ప్రముఖ సామాజిక కార్యకర్త, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, ప్రముఖ కవి, సినీ గీతరచయిత సురేంద్ర రొద్ద పాల్గొన్నారు. మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న గొర్తి వెంకటస్వామికి ఈ సందర్భంగా దుశ్శాలువా కప్పి, ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. విడపనకల్ మండలం పాల్తూరు మెయిన్ స్కూల్ హెడ్మాస్టర్ వెంకటస్వామి సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా, శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ సలహాదారుగా ఆయన పనిచేస్తున్నారు. గతంలో యాడికి మండల ఉత్తమ టీచర్ గా రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ నుంచి అవార్డు పొందారు. ఎస్.ఆర్. ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని 2022 సెప్టెంబర్ లో జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ చేతులమీదుగా అందుకున్నారు. ఎన్టీఆర్ శతజయంతోత్సవ కార్యక్రమంలో భాగంగా శ్రీవెంకట పద్మావతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయనకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం లభించింది. తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఎం. సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ ఎం. నరసింహ యాదవ్ తదితరులు 2023 మే 9న తిరుపతి యూత్ హాస్టల్లో ఘనంగా సత్కరించారు. విద్యారంగంతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళా, సామాజిక సేవారంగాల్లో వెంకటస్వామి తన వంతు పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పిల్లల సమగ్రాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్య సంరక్షణ కోసం విశేషకృషి సాగిస్తున్నారని గుర్తుచేశారు. గొర్తి వెంకటస్వామికి డా. సర్వేపల్లి జాతీయ అవార్డు రావడం పట్ల పలువురు కవులు, టీచర్లు హర్షం వ్యక్తంచేశారు.

## సంక్రాంతి పండుగ ప్రతీ ఇంట ఆనందం వెల్లివిరియాలి

### రైతులు పాడి పంటలతో తులతూగాలి

**వైఎస్సార్సీపీ కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు**



**శ్రీకాకుళం , జనవరి 13 :** సంక్రాంతి పండుగ మన సంస్కృతి , సాంప్రదాయాలకు ప్రతీక అని అటువంటి సంక్రాంతి పండుగతో ప్రతీ ఒక్కరి ఇంట ఆనందం వెల్లివిరియాలని వైఎస్సార్సీపీ కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు అన్నారు. సోమవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా ప్రజలకు , రాష్ట్ర వైసిపి నాయకత్వానికి , జిల్లా వైసిపి నాయకులకు , కార్యకర్తలకు, అధికార యంత్రాంగానికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతీ ఒక్కరిలో స్నేహ భావం , సంతోషం ,శ్రేయస్సు తీసుకురావాలని కోరారు. రైతులు దేశానికి వెన్నుముక అని ప్రతీ ఒక్క రైతు పాడిపంటలు సమృద్ధిగా పండి తులతూగాలని ఆకాంక్షించారు.

## ముదునూరికి భోగి శుభాకాంక్షలు తెలిపిన ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు



**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ శ్రీను కాకినాడ జిల్లా** ప్రత్తిపాడు నియోజకవర్గం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ని ధర్మవరం యూత్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో పూల బొకేతో భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ముదునూరి అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ



**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ శ్రీను** కాకినాడ జిల్లా ప్రతిపాడు నియోజకవర్గము ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామంలో సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని స్థానిక టిడిపి నాయకులు పసల సూరిబాబు, కోరుకొండ నూకరాజుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ విజేతలకు బహుమతులు అంద జేశారు. జూనియర్స్, సీనియర్స్ గా రెండు విభాగాలలో జరిగిన ఈ ముగ్గుల పోటీల్లో సుమారు 82 మంది మహిళలు పాల్గొని రంగవల్లులతో సుందరమైన ముగ్గులు వేశారు. నిర్వాహకులు విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులను ప్రకటించడంతో పెద్ద సంఖ్యలో మహిళలు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. సంక్రాంతి వేడుకలు పురస్కరించుకొని ఎమ్మెల్యే సత్య ప్రభ హరిదాసుని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షణలో భాగంగా ఇలాంటి ముగ్గులు పోటీలు నిర్వహించడం అభినందనీయమని. ముగ్గులు వేయడం అనేది ఒక కళ అని, ముగ్గుల పోటీలో పాల్గొని ప్రతి ఒక్కరూ విజేతలగానే భావించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

**– : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**

**అనంతపురం, జనవరి 13 :** జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో, సిరి సంపదలతో తులతూగుతూ ఉండాలని, భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలన్నారు. సంక్రాంతి అనగా నూతన క్రాంతి అని, సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారని, ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారన్నారు. సంక్రాంతి పండుగను మొదటి రోజు భోగి మంటలతో, రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పితృ దేవతలు, దేవుళ్ల పూజలతో, మూడవ రోజు గో పూజలతో మూడురోజుల పండుగ ఎంతో ఆనందంగా కొనసాగుతుందన్నారు. ప్రజలంతా భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలన్నారు. ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ తెలిపారు.

# సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలి

**– : ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు**

**– : రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్**



**అనంతపురం, జనవరి 13 :** రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో సంక్రాంతి పండుగ జరుపుకోవాలనిరాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ ఎంతో ముఖ్యమైన పండుగని, మూడు రోజులపాటు నిర్వహించుకునే ఈ పండుగను ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలని కోరుకున్నారు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారని, మకర సంక్రమణము నుండి ఉత్తరాయణ పుణ్యకాలము ప్రారంభమవుతుందని, ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారన్నారు. సంక్రాంతిని ప్రజలంతా మూడు రోజులపాటు ఎంతో ఆనందంగా చేసుకుంటారన్నారు. సంక్రాంతి పండుగను మొదటి రోజు భోగి మంటలతో, రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పితృ దేవతల, దేవుళ్ళ పూజలతో, మూడవ రోజు గో పూజలతో మూడురోజుల పండుగ ఎంతో ఆనందంగా కొనసాగుతుందని, ఈ పండుగను పెద్ద పండుగగా ఆంధ్రులు జరుపుకుంటారన్నారు. ప్రజలంతా భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు మంత్రి తెలియజేశారు.

# వెంకన్న భక్తులకు మరింత మెరుగైన సేవలు

**సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటున్నాం – టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు.**

**తిరుమల జనవరి 13:** తిరుమల శ్రీవారి భక్తులకు మరింత మెరుగైన, పటిష్టమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటున్నామని టిటిడి ఛైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్ లో సోమవారం టిటిడి ఈవో, టిటిడి అదనపు ఈవోలతో కలసి టిటిడి ఛైర్మెన్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు పాదర్శకంగా సేవలు అందించేందుకు పాలక మండలిలో సమిష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. పాలకమండలి తీసుకునే నిర్ణయాలను అమలు చేయడంలో కొన్ని సాంకేతిక కారణాలతో ఆలస్యం అవుతుండవచ్చనేమో కాని, ఆలస్యం అవుతోందని తొందరపడి అసత్య ప్రచారం చేయవద్దని మీడియాను విజ్ఞప్తి చేశారు. తిరుమల విషయంలో ఒకటికి రెండు సార్లు పరిశీలించి, సంబంధిత వ్యక్తుల నుంచి వాస్తవ సమాచారాన్ని తెలుసుకుని వార్తలు రాయాలని సూచించారు. ఒకరిద్దరు మీడియా, సోషల్ మీడియాలో టిటిడి ఛైర్మెన్ కు, ఈవో శ్రీ శ్యామల రావుకు మనస్పర్థలు ఉన్నాయంటూ వార్తలు రాయడం సరికాదన్నారు. వైకుంఠ ఏకాదశికి శ్రీవారి భక్తులకు మెరుగైన సేవలు అందించామన్నారు. విద్యుత్ కాంతులు, పుష్పాలంకరణలు, క్యూలైన్లు, శ్రీవారి దర్శనం, అన్న ప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలలో మరింత నాణ్యతగా అందించామన్నారు. తిరుపతిలో జరిగిన తోపులాట సంఘటన జరగడం సీఎం నారా చంద్రబాబు నాయుడు, తమను, దేశాన్ని, ప్రపంచాన్ని భాధించిందన్నారు. ఈ సంఘటనలో మృతి చెందిన కుటుంబాలకు , తీవ్రంగా గాయపడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 31 మందికి పరిహారం అందించామని, మరో 20 మందికి రెండు మూడు రోజుల్లో పరిహారం అందిస్తామన్నారు. చిన్న పొరపాట్లు చేయకుండా చాలా ముందు జాగ్రత్తతో సేవలు అందిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయవద్దని వినతి – ఈవో జె. శ్యామల రావు టిటిడికి సంబంధించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయవద్దని టిటిడి ఈవో శ్రీ జె. శ్యామలరావు విన్నవించారు. కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా చేస్తున్న అసత్య వార్తలను నమ్మవద్దని సూచించారు. టిటిడిలో పాలక మండలిలో చర్చించి తీసుకునే నిర్ణయాలను అమలు చేయడం తమ బాధ్యతన్నారు. టిటిడి ఛైర్మెన్ , ఈవో మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవు, సమన్వయ లోపం అసలు లేదన్నారు. టిటిడి ఛైర్మెన్ ను నేను ఏకవచంతో మాట్లాడినట్లు వచ్చిన వార్తలు నిజం కాదన్నారు. సాధారణ భక్తులకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సూచించిన సూచన మేరకు అమలు చేస్తున్నామన్నారు. గత 6 నెలల కాలంలో భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు, నెయ్యి సేకరణ, వసతి తదితర సేవలు అందిస్తున్నామన్నారు. టిటిడిలో దళారి వ్యవస్థను పూర్తిగా కట్టడి చేస్తున్నామని, ఆన్ లైన్ లో మోసాలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా టిటిడి విజిలెన్స్ విభాగం గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. టిటిడిలో విజన్ డాక్యుమెంట్ ప్రకారం మాస్టర్ ప్లాన్ ను అమలు చేస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన సందర్భాలలో వివిధ రంగాల నిపుణుల సూచనలు, సహకారం తీసుకోవడం గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు టిటిడి ఈవో మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ అంశంపై చాలా సమీక్షలు చేశామన్నారు. అనేకసార్లు తనిఖీలు, సమావేశాలు నిర్వహించి, ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించామన్నారు. తిరుమలలో భక్తులకు శ్రీవారి దర్శనం, క్యూలైన్లు, అన్నప్రసాదాలు, కంపార్ట్మెంట్ల నిర్వహణ, వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, తదితర అంశాలు పూర్తిగా టిటిడి పరిధిలో ఉంటుందన్నారు, తిరుపతిలో జన రద్దీని ఎలా అదుపు చేయాలి, జన రద్దీ నిర్వహణ, క్యూలైన్ మేనేజ్మెంట్ , భద్రతా ఏర్పాట్లు, క్యూలైన్లు ఎక్కడ ఏర్పాటు చేయాలి, ఎంత ఎత్తులో ఉండాలి, ఎన్ని ఏర్పాటు చేయాలి, వాటి పటిష్టత ఎంత ఉండాలనే అంశాలు, పాలన, శాంతిభద్రతలు పూర్తిగా జిల్లా మేజిస్ట్రేట్ , జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఉంటుందన్నారు. వారి సూచనల మేరకు టిటిడి ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సమన్వయం చేసుకుని, వారి సూచనల మేరకు టోకెన్ల జారీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తోపులాటలు జరుగకుండా చూసే బాధ్యత పూర్తిగా పోలీసుల చేతిలో ఉంటుందన్నారు. భక్తుల తోపులాట అంశంపై జ్యూడిషియల్ ఎంక్వైరీ జరుగుతోందని, న్యాయ విచారణలో పూర్తి విషయాలు వెల్లడవుతాయన్నారు.



ప్రతి భక్తుడికి నాణ్యమైన సేవలు – టిటిడి అడిషనల్ ఈవో తిరుమలలో ప్రతి భక్తుడికి నాణ్యమైన సేవలు అందించేందుకు గత ఆరు నెలలుగా అనేక సంస్కరణలు తీసుకువస్తున్నామని అడిషనల్ ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. దాతల విభాగాన్ని పూర్తిగా ఆడిట్ చేయించి అర్హులైన దాతలకు సేవలు అందేలా, మధ్యవర్తులను పూర్తిగా నిషేధించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు వసతి ఎవరికి కేయించాలో తెలియని అగమ్య పరిస్థితి నుంచి మరింత పూర్తి పారదర్శకంగా వసతి గదులు కేటాయిస్తున్నామన్నారు. రాబోవు రోజులలో వసతి గదులు కేటాయింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భక్తుల వాట్సాప్ కే పూర్తి సమాచారం, రిజిస్ట్రేషన్ చేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల భక్తులు ఎక్కువ సేపు వేచియుండకుండా శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామన్నారు. విచక్షణ కోటాను , మానవ జోక్యాలను తగ్గించి భక్తులకు త్వరతిగతిన దర్శనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనాన్ని అన్ని తరగతుల వారికి భేషుగ్గా ఏర్పాటు చేశామన్నారు.

## సాఫ్టాల్ ఛాంపియన్షిప్ పోటీలలో ఏపీ విజయదుందుభి

**–ఏపీ సీఈఓ సి.వెంకటేసులు**




**రాప్తాడు, జనవరి 13:** పాండిచ్చేరిలో ఈనెల 11 నుండి 13వ తేదీ వరకు జరిగిన సౌత్ జోన్ సాఫ్టుబాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో ఏపీ పురుషుల జట్టు కేరళపై 3–1 పాయింట్లతో విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా మహిళా జట్టు తృతీయ స్థానం సాధించిందని ఏపీ సీఈఓ సి.వెంకటేసులు సోమవారం తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలు పాల్గొన్న ఈ పోటీలలో ఏపీ క్రీడాకారులు విజయం సాధించడంపై సాఫ్ట్బాల్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు కూన రవికుమార్, ప్రధాన కార్యదర్శి సి.నాగేంద్ర, ట్రెజరర్ కోచ్ నరసింహారెడ్డి క్రీడాకారులను, మేనేజర్లను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం, శాప్ సహాయ, సహకారాలతో సాధ్యమైందని ఈ విజయం సాధ్యమైందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రీడా పాలసీతో క్రీడాకారులకు మూడు శాతం రిజర్వేషన్ తో క్రీడాకోటాలో ఉద్యోగాలు, ఉన్నత చదువులకు ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఇది ఒక వరమన్నారు. భవిష్యత్తులో సాఫ్ట్బాల్ లో మరిన్ని విజయాలను సాధించి రాష్ట్ర ప్రభుత్వానికి కానుకగా ఇస్తామన్నారు.

## బారీ భోగి మంట వెలిగించి సంక్రాంతి వేడుకలను ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు.

**తూర్పుగోదావరి జిల్లా రిపోర్టర్ జనవరి13:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గ



వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు అంబరాన్ని అంటుతున్నాయి. బిక్కవోలు మండలం కొమరిపాలెంలో స్థానిక కూటమి నాయకుడు, మాజీ వైస్ ప్రెసిడెంట్ ద్వారంపూడి వెంకటరెడ్డి (DVR గారు) ఆధ్వర్యంలో 20 అడుగుల ఎత్తు, 40 అడుగుల చుట్టూ విస్తీర్ణతతో భారీ దుంగలు భోగి మంట కోసం ఏర్పాటు చేశారు.గత 70 ఏళ్లుగా భారీ భోగి మంట ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక తెలిపారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి భోగిమంట వెలిగించి సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు.




ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరికి భోగభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

## తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

**దారపనేని చంద్రశేఖర్**

**కనిగిరి జనవరి 13** కనిగిరి నియోజకవర్గ ప్రజలకు తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను నియోజకవర్గ ప్రజలందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, సంక్రాంతి సకల శుభాలు అందించాలని, భోగిమంటలతో ప్రతి కుటుంబంలో భోగభాగ్యాలు వెల్లి విరియాలని, సరదాల సంక్రాంతిని సరదాగా జరుపుకోవాలని కమ్మని కనుముతో ప్రతి కుటుంబము సంతోషభరితంగా వర్ధిల్లాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పర్వదినాన ముంగిళ్ళ ముగ్గులతో, హరిదాసు గానాల తో, వాకిళ్ళ ముందర గంగిరెద్దుల విన్యాసాలతో సంక్రాంతి పండుగను నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని దారపనేని ఆకాంక్షించారు.



## జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు శుభాకాంక్షలు

**ఇంటిల్లిపాది సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్ష**

**– జిల్లా ఎస్పీ పి.జగదీష్**



**అనంతపురం జనవరి 13:** భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు పురస్కరించుకుని జిల్లా ప్రజలకు లిజిల్లా ఎస్పీ పి.జగదీష్ లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంటిల్లిపాది సంతోషంగా సంక్రాంతి పండుగను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికెళ్లకుండా భోగి, మకర సంక్రాంతి, కనుమలను ఆనందంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ పి జగదీష్ కోరారు.

## పండుగ భోగ భాగ్యాలు తీసుకు రావాలి

**సంక్రాంతి ప్రతి ఇంట కొత్త వెలుగులు తీసుకొస్తాయన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



**అనంతపురం జనవరి 13:** అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అని, ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారన్నారు. ప్రజల జీవితాల్లో సంక్రాంతి పండుగ సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలు సిరి సంపదలతో, భోగ భాగ్యాలతో తులతూగాలన్నారు. సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. సంక్రాంతి పండుగను మొదటి రోజు భోగి మంటలతో, రెండవ రోజు సంక్రాంతి పండుగను పొంగలి, పిండివంటలతో, పితృ దేవతలు, దేవుళ్ల పూజలతో, మూడవ రోజు కనుమ పండుగను కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలన్నారు. రైతుల జీవితాల్లో నిత్య సంక్రాంతులను కొనసాగించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో వచ్చే సంక్రాంతికి రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. అర్బన్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటా ఈ పండుగ వెలుగులు నింపే విధంగా దేవున్ని ప్రార్థిస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## కోడి పందేలు, జూదానికి యువత దూరంగా ఉండటమే ఈవీఈ లక్ష్యం

**కొత్తూరు తాడేపల్లిలో 12వ ఈవీఈ ఓపెన్ బ్యాడ్మింటన్ పోతేల ప్రారంభంలో ఈడా వేదాద్రి**



**విజయవాడ జనవరి 13:** మూడు రోజుల సంక్రాంతి పండుగ సమయంలో యువతను కోడి పందేలు, జూద క్రీడలకు దూరంగా ఉంచడమే లక్ష్యంగా ఏటా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నట్లు ఈడా వేదాద్రి ఇంజనీర్స్ (ఈవీఈ) ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్, ఇంజనీర్ ఈడా వేదాద్రి అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో యువత దృష్టి కోడి పందేలు, జూదం వైపు మళ్లకుండా ఉండేందుకే 12 ఏళ్లగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ను చైర్మన్ ఈడా వేదాద్రి సోమవారం తన మామిడి తోటలో ప్రారంభించారు. విజయవాడ నగరంతోపాటు విజయవాడ రూరల్, జీ కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో యువత ఈ పోటీలలో పాల్గొంటోంది. ప్రారంభ కార్యక్రమంలో వేదాద్రి మాట్లాడుతూ, యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంతోపాటు వీలైనంత ఎక్కువ మంది క్రీడాకారులను తయారు చేసే ఉద్దేశంతోనే ఏటా జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదువుతోపాటు క్రీడలలో రాణించిన వారికి ప్రభుత్వం మంచి ఉద్యోగవకాశాలు కల్పిస్తోందన్నారు. పీవీ సింధు, శ్రీకాంత్, వెన్నం జ్యోతి సురేఖ వంటి అంతర్జాతీయ క్రీడాకారులకు ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగవకాశాలను కల్పించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మట్టిలో మాణిక్యాలు ఉన్నారని, వారికి తగిన శిక్షణ ఇస్తే ఉత్తమ క్రీడాకారులుగా తయారవుతారని పేర్కొన్నారు. ఇదిలావుండగా, బ్యాడ్మింటన్ నేర్చుకోవాలనుకునే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ సౌకర్యం కూడా కల్పించినట్లు ఆయన చెప్పారు. సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలు ఈ నెల 15వ తేదీతో ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తిరుమల ఘాట్ రోడ్ లో దట్టమైన పొగమంచు

**వాహన దారులు జాగ్రత్తగా ప్రయాణించాలని విజ్ఞప్తి**

**తిరుమల జనవరి 13:** తిరుమలకు వెళ్లే రెండవ ఘాట్ లో దట్టమైన పొగమంచు కారణంగా ఎదురుగా ఉన్న వాహనాలు సరిగ్గా కనపడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కనుక వాహనదారులు దయచేసి ఘాట్ రోడ్డు లో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరడమైనది. పొగను అదుపు చేసిన సిబ్బంది కాగా శ్రీవారి లడ్డూ విక్రయ కేంద్రంలో సోమవారం 47వ కౌంటర్ లో యూపిఎస్ వైర్ కాలడంతో వ్యాపించిన పొగ. వెంటనే అప్రమత్తమై పొగను సిబ్బంది అదుపు చేశారు.

# 'లొట్ట పీసు'.. అంత ఈజీగా కొట్టిపారేయకండి



లొట్ట పీసు చెట్టు.. ఇదేదో పిచ్చి మొక్క అనుకుంటే.. పొరపాటే.. దీనిలోని ఔషధ గుణాలు తెలిస్తే ఔరా అంటారు. లొట్టపీసు చెట్టునే తుత్తు కాడ చెట్టు, పిస చెట్టు అని కూడా పిలుస్తారు. ఈ చెట్లు గ్రామాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. రోడ్లకు ఇరువైపులా, చెరువుల దగ్గర, కంపల్లో విస్తృతంగా పెరుగుతుంటాయి. ఇది పాలుగారే మొక్క..ఈ చెట్టు ఆకులను, కాండాన్ని తుంచినప్పుడు వాటి నుండి పాలు రావడం కనిపిస్తుంది. ఈ చెట్టు ఆకులను, పూలను తింటే పిచ్చి వాళ్లు అవుతారని నమ్ముతారు. అంతేకాదు..పశువులు కూడా ఈ మొక్క జోలికి రావు. లొట్ట పీసు చెట్టులో ఎన్నో ఔషధ గుణాలు దాగి ఉన్నాయి. లొట్టపీసు చెట్టు వల్ల మన ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. లొట్ట పీసు మొక్కలో ఉండే పాలు తేలు విషానికి విరుగుడులా పనిచేస్తాయి. చర్మం మీద తామర వంటి చర్మ వ్యాధులు వచ్చినప్పుడు ఈ పాలు రాస్తే తగ్గిపోతుంది. మనుషులను కుట్టే దోమలను, పంటల దిగుబడిని దెబ్బతీసే దోమలను ఈ మొక్క ఆకుల నుంచి వచ్చే పొగతో నివారించొచ్చు. లొట్ట పీసు మొక్కలను కాగితం తయారీలోనూ వినియోగిస్తారు. ఈ చెట్టు ఆకులను ఉపయోగించడం వల్ల మనం పాదాల వాపులను తగ్గించుకోవచ్చు. లొట్టసు పీసు చెట్టు ఆకులను మెత్తగా నూరి దానికి ఆవనూనె కలిపి వేడి చేయాలి. ఇలా తయారు చేసుకున్న పేస్ట్ ను పాదాల వాపులపై రాసి నెమ్మదిగా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల పాదాల వాపులు తగ్గుతాయి. వయసుపై బడే కొద్ది అనేక రకాల నొప్పులు వస్తూ ఉంటాయి. నొప్పులతో బాధపడతున్నప్పుడు ఈ ఆకుల పేస్ట్ ను రాసి కట్టుకట్టాలి. ఇలా చేయడం వల్ల నొప్పులు తగ్గుతాయి. కానీ, దీనిని ఉపయోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే ఉపయోగించాలని ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్నారు. లొట్టపీసు చెట్ల ఆకులను నీడలో ఎండబెట్టి.. గో మూత్రంతో కలిపి సేంద్రియ ఎరువులా ఉపయోగిస్తారు. పల్లెల్లో ఈ కట్టెలతో ఇళ్లకు దడిగా, పశువుల కొట్టాలకు రక్షణ గోడగా కట్టుకునేవారు. ఎండిపోయిన లొట్టపీసు కట్టెలను వీపునకు కట్టుకొని పిల్లలు ఈత నేర్చుకునేవారు. ఇలా ఈ లొట్టపీసు చెట్టు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

# ఆడవాళ్లు సబ్జా గింజలు తినొచ్చా?



సబ్జా గింజలు మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటి వినియోగం, లాభాలు దాదాపు మనందరికీ తెలిసిందే. అందుకే ఇటీవలి కాలంలో సబ్జా సీడ్స్ పలు రకాల జ్యూస్‌లు, స్మూతీస్‌లలో ఎక్కువగా వాడుతున్నారు. అయితే, వీటిని సమ్మర్‌లో తీసుకోవటం వల్ల వేడి నుండి ఉపశమనం కలిగిస్తుందని తెలుసు.. కానీ, ఈ సబ్జా గింజలను సరైన మోతాదులో అన్ని కాలల్లోనూ తీసుకోవచ్చు అంటున్నారు నిపుణులు. శీతాకాలంలో ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున తీసుకుంటే మరింత ప్రయోజనం అంటున్నారు. సబ్జా గింజల్లో ప్రోటీన్స్, కాల్షియం,మెగ్నీషియం, పాస్పరస్ పుష్కలంగా ఉంటాయి. దీని వలన ఎముకలు ధృడంగా ఉంటాయి. మినరల్స్ కూడా పుష్కలంగా లభిస్తాయి. సబ్జా గింజల్లో ఫైబర్ కంటెంట్ అధికంగా ఉంటుంది. దీని వల్ల ఎక్కువ సమయం పాటు కడుపు నిండుగా అనిపిస్తుంది. ఆకలి నియంత్రణలో ఉంటుంది. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. సబ్జా గింజలు తీసుకోవడం వలన కడుపు ఉబ్బరం తగ్గుతుంది. శరీరాన్ని చల్లబరుస్తుంది. తలనొప్పి, మైగ్రేన్ లాంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు ఈ గింజల్ని నీళ్లలో కలుపుకొని అవి ఉబ్బిన తర్వాత తాగితే ఫలితం ఉంటుంది. తలనొప్పి తగ్గిపోతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఈ గింజలను ఒక గ్లాసు నీటిలో వేసుకుని తాగితే మంచి ఫలితముంటుంది. శీతాకాలంలో సబ్జాగింజలు ఉదయాన్నే ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయి. చలికాలంలో మనం తీసుకునే ఆహారం అంత త్వరగా జీర్ణం కాదు..ఎందుకంటే, చలికారణంగా శారీరక శ్రమ తక్కువగా ఉంటుంది. దీంతో తీసుకున్న ఆహారం జీర్ణం కాకుండా ఉంటుంది. జీర్ణ సమస్యలు రావు. ఇందులో ఉండే ఫైబర్ తీసుకున్న ఆహారం త్వరగా జీర్ణం కావడానికి తోడ్పడుతుంది. ప్రోటీన్, ఐరన్ , మెగ్నీషియం, కాల్షియం,విటమిన్ కె సబ్జాగింజల్లో అధికంగా ఉండటం వలన జుట్టు రాలే సమస్య, చుండ్రు వంటి జుట్టు సమస్యలు తగ్గుతాయి. సబ్జా గింజల్లో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల చర్మం పొడిబారడం తగ్గతుంది. మహిళలకు తప్పకుండా కావాల్సిన ఫోలేట్‌తో పాటు అందాన్ని ఇనుమడింపచేసే విటమిన్ 'ఇ' కూడా ఇందులో లభిస్తుంది. బరువు తగ్గడం నుంచి జుట్టు పెరగడం వరకు శరీరానికి ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది సబ్జా గింజలు. ఇందులో ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ఎ,కె, సి తో పాటు మినరల్స్, కాల్షియం,మెగ్నీషియం, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. సబ్జా గింజలు తీసుకోవడం వలన జీర్ణ శక్తి మెరుగవుతుంది. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. రోజూ ఉదయాన్నే సబ్జా గింజలు నానబెట్టిన నీటిని తాగడం అలవాటు చేసుకుంటే జుట్టు సమస్యలన్నీ తొలగిపోతాయి.. నల్లని జుట్టును పొందవచ్చు.

# మసాలా ఎగ్ పరాటా.. ఒకదాని తర్వాత మరొకటి లాగించేస్తారు..



గుడ్డుతో ఎన్నో రకాల రెసిపీలు తయారు చేసుకుని తింటూ ఉంటారు. వీటితో ఏం చేసినా టేస్టీగానే ఉంటాయి. చాలా మందికి కోడిగుడ్డుతో చేసే ఎగ్ పరాటాలు అంటే ఇష్టం. వీటిని మనం ఇంట్లో కూడా తయారు చేసుకోవచ్చు. ఎప్పుడూ చేసుకునే పరాటాల కంటే మసాలా ఎగ్ పరాటాలను ఇలా చేయండి.. ఇక ఒకదాని తర్వాత మరొకటి లాగిస్తూ ఉంటారు.. కోడి గుడ్డు ఆరోగ్యానికి చాలా మంచిదన్న విషయం తెలిసిందే. ఇందులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. వీటితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ప్రతి రోజూ ఉడకబెట్టిన ఒక గుడ్డు తింటే ఇమ్యూనిటీ పవర్ అనేది బాగా పెరుగుతుంది. శరీరం బలంగా, దృఢంగా ఉంటుంది. ఇక గుడ్డుతో ఎన్నో రకాల రెసిపీలు తయారు చేసుకుని తింటూ ఉంటారు. వీటితో ఏం చేసినా టేస్టీగానే ఉంటాయి. చాలా మందికి కోడిగుడ్డుతో చేసే ఎగ్ పరాటాలు అంటే ఇష్టం. వీటిని మనం ఇంట్లో కూడా తయారు చేసుకోవచ్చు. ఎప్పుడూ చేసుకునే పరాటాల కంటే మసాలా ఎగ్ పరాటాలను ఇలా చేయండి.. ఇక ఒకదాని తర్వాత మరొకటి లాగిస్తూ ఉంటారు. పిల్లలకు కూడా బాగా నచ్చుతుంది. మరి ఈ మసాలా ఎగ్ పరాటాలను ఎలా తయారు చేస్తారు? ఈ రెసిపీకి కావాల్సిన పదార్థాలు ఏంటో ఇప్పుడు చూసేయండి.

మసాలా ఎగ్ పరాటాలకు కావాల్సిన పదార్థాలు: ఉడకబెట్టిన కోడి గుడ్లు, మిరియాల పొడి, కొత్తిమీర తరుగు, కారం, ధనియా పొడి, ఉల్లిపాయ, పచ్చి మిర్చి, గోధుమ పిండి, నూనె లేదా నెయ్యి. మసాలా ఎగ్ పరాటాలు తయారీ విధానం: ముందుగా ఉడికించిన గుడ్లను సన్నగా కట్ చేసి ఓ గిన్నెలోకి తీసుకోండి. ఇందులో సన్నగా కట్ చేసిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, మిరియాల పొడి, కొత్తిమీర తరుగు, కారం, కొద్దిగా ధనియాల పొడి, కొద్దిగా సాల్ట్ ఇందులో కొద్దిగా నెయ్యి లేదా బటర్ వేసి అన్నీ మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని కాసేపు పక్కన పెట్టండి. మరో లోతైన గిన్నె తీసుకుని.. అందులో గోధుమ పిండి, ఉప్పు, కొద్దిగా నెయ్యి, నీళ్లు వేసి మెత్తగా ఉండేలా చపాతీ పిండిని కలుపుకోండి. ఈ పిండిని ఓ పావు గంట సేపు పక్కన పెట్టండి. ఆ తర్వాత చిన్న చిన్న ఉండల్లా చేసి ఒక్కో దాన్ని ముందు చిన్న ముద్దగా చేసి.. మధ్యలో ఈ ఎగ్ మిశ్రమాన్ని ఉంచండి. ఆలూ పరాటా ఎలా తయారు చేస్తారు.. అదే విధంగా ఈ పరాటాను కూడా అన్నీ తయారు చేసుకోవాలి. ఆ తర్వాత బటర్ లేదా ఆయిల్‌తో పరాటాలను కాల్చుకుని వేడి వేడిగా తింటే.. ఆహా చాలా రుచిగా ఉంటుంది. నేరుగా ఉత్తివి తిన్నా చాలా రుచిగా ఉంటాయి. లేదంటే నాన్ వెజ్ కర్రీ అయినా పన్నీర్ కర్రీతో తిన్నా బాగుంటాయి.

# ఆలుగడ్డలను తినే ముందు ఆలోచించాల్సిందే..



ఆలుగడ్డలతో ఎన్నో రకాల స్నాక్స్ తయారు చేస్తూ ఉంటారు. వీటితో ఎన్నో రకాల నోరూరించే రెసిపీలు తయారు చేసుకోవచ్చు. కానీ వీటిని ఎక్కువగా తినడం వల్ల డయాబెటీస్ వస్తుంది. కాబట్టి ఈ మధ్య కాలంలో వీటి వాడకం తగ్గింది. చాలా మందికి ఇష్టమైన వాటిల్లో బంగాళ దుంపలు కూడా ఒకటి. చాలా మంది ఎక్కువగానే కొని ఇంట్లో పెట్టుకుంటూ ఉంటారు. వీటితో అనేక రకాలైన స్నాక్స్ తయారు చేసుకోవచ్చు. కూరగాయాల్లో ఎక్కువగా నిల్వ ఉండే వాటిల్లో ఆలుగడ్డలు కూడా ఒకటి. అయితే బంగాళ దుంపలు ఎలా ఉన్నా మంచిదే అని కొనేస్తారు. ఇంట్లో రోజుల తరబడి నిల్వ చేసినవి కూడా వండుతూ ఉంటారు. అయితే ఆలుగడ్డలు అనేవి ఆకు పచ్చగా మారినా, మొలకెత్తినా తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇలా మారిన ఆలు గడ్డలు విష పూరితంగా మారతాయని, వీటి వలన అనేక రకాల సమస్యలు వస్తాయని పోషకాహార నిపుణులు అంటున్నారు. ఇలాంటి వాటిని పడేయాలి కానీ ఎట్టి పరిస్థితుల్లో తినకూడదని సూచిస్తున్నారు. మొలకెత్తిన ఆలు గడ్డల్లో సోలనిన్, చాకోనైన్ అనే గ్లైకో ఆల్కలాయిడ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కేవలం ఆలుగడ్డల్లోనే కాదు వంకాయలు, టమాటాల్లో కూడా ఉంటాయి. ఇవి చాలా విష పూరితమైనవి. వీటిని తినడం వల్ల రక్త పోటు రావడం, పల్స్ వేగంగా కొట్టుకోవడం, గందరగోళంగా ఉండటం, తల నొప్పి, జ్వరం, విరేచనాలు, వాంతులు వంటి సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి మొలకెత్తిన బంగాళ దుంపల్ని మాత్రం అస్సలు తినకూడదు.

# నోటి పూత ఇబ్బంది పడుతున్నారా!



శీతా కాలంలో ఎంతో మందిని ఇబ్బంది పెట్టే సమస్యల్లో నోటి సమస్యలు కూడా ఒకటి. నోట్లో చెడు బ్యాక్టీరియా పెరిగిపోతే.. నోటి పూత, పుండ్లు, చిగుళ్ల వాపు, నాలుక పగలడం వంటి సమస్యలు తలెత్తుతాయి. దీంతో తినేందుకు కూడా ఇబ్బందిగా ఉంటుంది. కానీ ఈ చిట్కాలతో ఆ సమస్యలకు బైబై చెప్పొచ్చు. వింటర్ సీజన్‌లో అందరికీ వచ్చే సమస్యల్లో నోటి పూట, వాపు, చిగుళ్ల నొప్పి కూడా ఒకటి. నోటికి సంబంధించిన సమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటారు. పెదవుల లోపల, బయట చిన్న పుండ్లు అనేవి ఏర్పడుతూ ఉంటాయి. చిగుళ్లు వాపు కూడా వస్తాయి. దీంతో తినేందుకు, తాగేందుకు ఇబ్బందిగా ఉంటుంది. నోటి సమస్యలను తగ్గించడంలో యాపిల్ సైడర్ వెనిగర్ ఎంతో చక్కగా పని చేస్తుంది. అర గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టేబుల్ స్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి.. నోట్లో వేసుకుని పుక్కిలించి.. ఊసేయాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేస్తే నోటి పూత, చిగుళ్ల వాపు కంట్రోల్ అవుతాయి. నోటిని సమస్యలను తగ్గించడంతో లవంగాలు కూడా ఎంతో చక్కగా పని చేస్తాయి. చెడు బ్యాక్టీరియాను నశింప చేస్తుంది. ఒక లవంగం నోట్లో పెట్టుకుని చప్పరిస్తూ రసాన్ని పీల్చుతూ ఉండాలి. దీని వల్ల నోట్లో పుండ్లు, పూత, వాపులు తగ్గుతాయి. నోటి సమస్యలను తగ్గించడంలో పసుపు ఎంతో చక్కగా పని చేస్తుంది. నీటిలో కొద్దిగా జీలకర్ర, పసుపు వేసి మరిగించాలి. గోరు వెచ్చగా ఉన్నప్పుడు నోట్లో వేసి పుక్కలిస్తే ఇన్ఫెక్షన్స్ ఏమన్నా ఉంటే తగ్గి.. సమస్యలు కంట్రోల్ అవుతాయి. తేనె కూడా నోటి ప్రాబ్లమ్స్‌ని కంట్రోల్ చేయడంలో ఎఫెక్టీవ్‌గా పని చేస్తుంది. తేనెలో కూడా యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. ఇవి నోటి పూత, వాపు వంటి సమస్యలకు ఆయింట్మెంట్‌లా వర్క్ చేస్తుంది. సమస్య ఉన్నచోట తేనె రాస్తూ ఉండాలి.

## బిజినెస్

# పాకిస్థాన్‌లో భారీ బంగారు నిల్వలు

ఓటమి ఖాయమనుకుంటున్న క్రికెట్ మ్యాచ్ లో ఆఖరి బాల్ సిక్స్ కొట్టి గెలిస్తే ఎలా ఉంటుందో, అదే మజాను మన పొరుగుదేశం పాకిస్థాన్ పొందుతోంది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతలా పతనం అయ్యిందో ప్రపంచానికి తెలుసు. రాజకీయ అస్థిరత, టెర్రరిజం, అంతర్గత కలహాలతో పాకిస్థాన్ దుర్భర స్థితిలో ఉంది. ప్రపంచ దేశాలు అందించే ఆర్థిక సాయంతోనే మనుగడ సాగిస్తోంది. ఇలాంటి కష్టకాలంలో 32.6 మెట్రిక్ టన్నుల భారీ బంగారు నిల్వలను ఆ దేశంలో గుర్తించారు. దాని విలువ దాదాపు రూ.600 మిలియన్లు ఉంటుందని అంచనా. దాన్ని సక్రమంగా వినియోగించుకుంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకునే అవకాశం ఉంది. పాకిస్థాన్ లోని పంజాబ్ రాష్ట్రంలో గల అటాక్ జిల్లాలో ప్రవహిస్తున్న సింధు నదిలో బంగారు నిల్వలను గుర్తించారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ పాకిస్థాన్ (జీఎస్పీ) ఈ నిల్వలను కనుగొంది. 32.6 మెట్రిక్ టన్నుల విలువైన బంగారు నిక్షేపాల విలువ 600 బిలియన్ పాకిస్థాన్ రూపాయలు ఉంటుందని అంచనా. ఈ విషయాన్ని పంజాబ్ మైనింగ్ మంత్రి ఇబ్రహీం హాసన్ మురాద్ ధ్రువీకరించారు. మన పొరుగున మరో దేశం చైనా కూడా ఇటీవలే బంగారు నిల్వలను కనుగొంది. ఈశాన్య ప్రాంతంలోని పింగ్జియాంగ్ కౌంటీలో 1000 టన్నుల అధిక నాణ్యత కలిగిన ఖనిజాన్ని ఆ దేశ పరిశోధకులు గుర్తించారు. దాని విలువ సుమారు 600 బిలియన్ యువాన్లు (రూ.6,914,73 కోట్లు)గా నిర్ధారణ చేశారు. ఇప్పటి వరకూ



బయటపడిన అతి పెద్ద బంగారం నిల్వలలో ఇదే అత్యధికమని చెప్పవచ్చు. చైనా దేశంలో దొరికిన బంగారు నిధితో ఆ దేశం పాలకులు సంతోషం వ్యక్తం చేశారు. వారి కన్నా పాకిస్థాన్ పాలకులు సంబరాలు చేసుకుంటున్నారు. తీవ్రమైన ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న పాకిస్థాన్ కు ఈ నిధి చాలా అత్యవసరం. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆ దేశానికి ఊపిరి అందుతుంది. అయితే ఆ నిల్వలను సక్రమంగా వినియోగించుకోవడమే అత్యంత అవసరం. తీవ్ర ఇబ్బందులతో కొనసాగుతున్న ఆర్థిక వ్యవస్థ మళ్లీ గాడిన పడడంతో పాటు దేశంలో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

## ఇంటర్నెట్ లేకుండానే యూపీఐ చెల్లింపులు




భారతదేశంలో 2016లో నోట్ల రద్దు తర్వాత యూపీఐ చెల్లింపులు గణనీయంగా పెరిగాయి. భౌతిక నగదు లేకుండా చెల్లింపులను సులభతరం చేసేలా ఎన్‌పీసీఐ యూపీఐ చెల్లింపులను లాంచ్ చేసింది. చిల్లర సమస్యకు యూపీఐ చెల్లింపులు చెక్ పెట్టాయి. అయితే యూపీఐ చెల్లింపులు చేయాలంటే కచ్చింగా ఇంటర్నెట్ కావాలి అనే విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇంటర్నెట్ అవసరం లేకుండా యూపీఐ చెల్లింపులను ఎలా చేయాలో? ప్రస్తుతం డిజిటల్ యుగంలో యూపీఐ మన రోజువారీ జీవితంలో అంతర్భాగంగా మారింది. రెస్టారెంట్‌లో షాపింగ్ చేయడానికి లేదా భోజనానికి చెల్లించాలన్నా మనలో చాలా మంది ఆన్‌లైన్ చెల్లింపులపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. అయితే ఈ లావాదేవీలు ఇంటర్నెట్ కనెక్టివిటీపై ఆధారపడి ఉంటాయి. అయితే ఒక్కోసారి ఇంటర్నెట్ సరిగ్గా పని చేయకపోతే మన యూపీఐ చెల్లింపులకు అంతరాయం కలిగిస్తుంది. అయితే ఇంటర్నెట్ లేకుండాన యూపీఐ చెల్లింపులను చేయవచ్చని చాలా మందికి తెలియదు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఇంటర్నెట్ సదుపాయం లేకుండా యూపీఐ చెల్లింపులను అనుమతించే కొత్త సేవను ప్రవేశపెట్టింది. యాక్టివ్ ఇంటర్నెట్ లేకపోయినా యూపీఐ సేవలను అధికారిక యూఎస్ఎస్‌డీ సర్వీస్‌ను ఉపయోగించి యూపీఐ సేవలను పొందవచ్చు.

## త్వరలోనే మార్కెట్‌లోకి క్రెటా ఈవీ



భారతదేశంలో ఈవీ మార్కెట్ రోజురోజుకూ వృద్ధి చెందుతుంది. అయితే ఎలక్ట్రిక్ వాహనాల్లో ఎక్కువగా స్కూటర్లే అమ్మకాలు సాగిస్తున్నాయి. కానీ గత కొన్ని రోజులుగా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలను కూడా కొనుగోలుకు ఆసక్తి చూపడంతో చాలా కంపెనీలు తమ సక్సెస్ మోడల్స్‌ను ఈవీ వెర్షన్‌లో రిలీజ్ చేస్తున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ హ్యూందాయ్ తన టాప్ సెల్లింగ్ మోడల్ క్రెటా ఈవీను త్వరలో లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఎస్‌యూవీల్లో ఒకటైన హ్యూందాయ్ క్రెటా మార్కెట్లోకి ప్రవేశించిన 10 సంవత్సరాల తర్వాత ఈవీ వెర్షన్‌లో లాంచ్ కావడానికి సిద్ధంగా ఉంది. జనవరి 17న జరిగే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో హ్యూందాయ్ ఎలక్ట్రిక్ క్రెటా లాంచ్ చేయనున్నారు. హ్యూందాయ్ 2015లో ప్రారంభించినప్పటి నుంచి దాదాపు 11 లక్షల క్రెటా యూనిట్లు అమ్ముడయ్యాయి. భారతదేశంలో 10 లక్షల యూనిట్ల విక్రయ మైలురాయిని దాటిన మూడు ఎస్‌యూవీల్లో ఒకటిగా ఉంది. హ్యూందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ గ్రానైట్ గ్రే, డార్క్ నేవీలో డ్యూయల్ టోన్ ఇంటీరియర్ థీమ్‌తో వస్తుంది. ఇక కన్సోల్ విషయానికి వస్తే ఓషన్ బ్లూ సరౌండ్ యాంబియంట్ లైటింగ్‌తో వస్తుంది. డ్యూయల్ కర్విలినియర్ ఇన్ఫోటైన్‌మెంట్ 10.25 అంగుళాల స్క్రీన్‌తో పాటు టచ్-ఎనేబుల్డ్ డ్యూయల్ ఆటోమేటిక్ టెంపరేచర్ కంట్రోల్ కూడా ఉంటుంది. క్రెటా ఎలక్ట్రిక్ 2,610 ఎంఎం వద్ద క్రెటా ఐసీఈకు సమానమైన వీల్‌బేస్‌తో వస్తుంది. క్రెటాలో వాడిన ఫాబ్రిక్ రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ సీసాలతో చేశారు.

# అమెరికాతో ప్రపంచంలో అనిశ్చితి

అమెరికా వాణిజ్య విధానం వల్ల ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్ట్ ట్రంప్ ప్రభుత్వ ప్రతిపాదిత సుంకాలు, పన్నుల పెంపు, నియంత్రణ నిబంధనలను అమల్లోకి వస్తే ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం ఉంటుందన్నారు. శనివారం ఆమె ఓ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా స్థిరంగా అభివృద్ధి కొనసాగుతున్నప్పటికీ 2024-25లో భారత వృద్ధిరేటు స్వల్పంగా బలహీన పడవచ్చునని అన్నారు. జిడిపి బలహీన పడటానికి కారణాలేమీ జార్జివా వివరించలేదు. దీనిపై మరిన్ని వివరాలను ప్రపంచ ఆర్థిక పరిస్థితిపై రాబోయే నివేదికలో పొందుపర్చుతామన్నారు. ప్రాంతీయంగా విభేదాలు ఉన్నా, గ్లోబల్ వృద్ధిరేటు నికరంగా ఉంటుదన్నారు. ఐఎంఎఫ్ వరల్డ్ ఎకానమీ ఔట్‌లుక్ ప్రకారం అమెరికా వద్ధిరేటు అంచనాలకన్నా మెరుగ్గా ఉంటుందని చెప్పారు. యూరోపియన్ యూనియన్ అభివృద్ధి నిలిచిపోవచ్చున్నారు. బ్రెజిల్ ఆర్థిక వ్యవస్థపై అధిక ద్రవ్యోల్బణం ప్రభావం చూపుతుందన్నారు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద రెండో ఆర్థిక వ్యవస్థ చైనాలో ప్రతికూల ద్రవ్యోల్బణం నెలకొందన్నారు. దేశీయంగా డిమాండ్లకు




సవాళ్లు ఎదురవుతాయన్నారు. అన్ని రకాల చర్యలు తీసుకున్నా తక్కువ ఆదాయ దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ట్రంప్ ప్రభుత్వం అమలు చేసే సుంకాలు, పన్నులు, నియంత్రణ నిబంధనలను అమల్లోకి తెస్తే మరింత ప్రతికూల ప్రభావం ఉంటుందన్నారు. చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలపై అదనపు సుంకాలను విధించే ప్రణాళికలను డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. జనవరి 20న ఆయన అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సుంకాలను పెంచాలనేది ఆయన ప్రధాన ఉద్దేశ్యంగా బహిరంగంగా ప్రకటించారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను మరింత పెంచుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ సరఫరా వ్యవస్థపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలు అనిశ్చితికి గురవుతాయన్నారు.

# చాంపియన్స్ ట్రోఫీకి దక్షిణాఫ్రికా జట్టు ఎంపిక

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి దక్షిణాఫ్రికా జట్టును ప్రకటించింది. టెంబా బావుమా నాయకత్వంలో ఐసీసీ ఈవెంట్‌లో దక్షిణాఫ్రికాలోకి బరిలోకి దిగనున్నది. గాయాలతో జాతీయ జట్టుకు దూరమైన ఫాస్ట్ బౌలర్లు లుంగి ఎంగిడీ, అన్రిచ్ అన్రిచ్ నోర్జేను సైతం ఎంపిక చేసింది. జట్టుల్లో ఐదుగురు ఫాస్ట్ బౌలర్లు, ముగ్గురు స్పిన్నర్లకు అవకాశం ఇచ్చింది. బావుమా నాయకత్వంలో దక్షిణాఫ్రికా ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ క్రమంలో చాంపియన్స్ ట్రోఫీలోనూ టీమ్ కప్ నెగ్గాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నది. చాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఆఫ్ఘనిస్థాన్‌తో కలిసి గ్రూప్-బీలో ఉంది.
గత నెలలో అన్రిచ్ కాలికి గాయమైంది. దాంతో పాక్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ఎన్గిడీ సైతం గాయం కారణంగా శ్రీలంక, పాకిస్థాన్‌తో జరిగిన వన్డే దూరమయ్యాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో సౌతాఫ్రికా సెమీఫైనల్‌కు చేరింది. ఆ సమయంలో జట్టు ప్రదర్శన అద్భుత ప్రదర్శన చేసింది. సెమీ ఫైనల్స్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఖంగుతిన్నది. ఆ టోర్నమెంట్‌లోనూ టెంబా బావుమా కెప్టెన్‌గా వ్యవహరించాడు. చాంపియన్స్ ట్రోఫీకి సైతం బావుమానే కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. ఫిబ్రవరి 19న చాంపియన్స్ ట్రోఫీ మొదలుకానున్నది. ప్రొటీస్ జట్టు తొలి మ్యాచ్‌ను 21న కరాచీలో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడుతుంది. ఆ తర్వాత 25న రావల్పిండిలో ఆస్ట్రేలియాతో, మార్చి 1న ఇంగ్లాండ్‌తో గ్రూప్ దశ మ్యాచ్‌లు ఆడుతుంది.
ఉపఖండం పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని దక్షిణాఫ్రికా



సెలెక్టర్లు ముగ్గురు స్పిన్నర్లతో పాటు ఐదుగురు ఫాస్ట్ బౌలర్లను ఎంపిక చేశారు. ఇటీవల గాయపడ్డ ఫాస్ట్ బౌలర్ నాంద్రే బర్గర్ జట్టులో అవకాశం ఇవ్వలేదు. దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు జట్టులో వీలైనంత ఎక్కువ మంది ఆల్ రౌండర్లను ప్రాధాన్యం ఇచ్చింది. ఈ క్రమంలోనే రీహాబిలిటేషన్‌లో ఉన్న వియాన్ ముల్డర్‌కు సైతం ఎంపిక చేసింది. శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో చేతికి గాయమైంది. ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన రెండో టెస్టుకు అందుబాటులోకి వచ్చాడు. తాజాగా ఫియోజియో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసింది. జట్టులో కేశవ్ మహారాజ్, తబ్రేజ్ షంసి రూపంలో ఇద్దరు స్పిన్నర్లను ఎంపిక చేయగా.. ఐడెన్ మార్క్‌రమ్ సహాయం చేయనున్నాడు. లుంగి ఎన్గిడీ, అన్రిచ్ నోర్జే, కసిగో రబాడా, ముల్డర్ ఫాస్ట్ బౌలర్ల కేటగిరిలో ఎంపిక చేసింది.

**ఛాంపియన్స్ ట్రోఫీకి దక్షిణాఫ్రికా జట్టు**

టెంబా బావుమా (కెప్టెన్), టోనీ డీ జోర్జి, మార్కో జాన్సెన్, హెన్రిచ్ క్లాసెన్, కేశవ్ మహారాజ్, ఐడెన్ మార్క్‌రమ్, డేవిడ్ మిల్లర్, వియాన్ ముల్డర్, లుంగి ఎన్గిడీ, అన్రిచ్ నోర్జే, కగిసో రబాడా, ర్యాన్ రికెల్టన్, తబ్రైజ్ షంసి, ట్రిస్టన్ స్టబ్స్, రాస్సీ వాన్ డెర్ డస్సెన్.

# ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ వ్యవహరించనున్నాడు. ఈ మేరకు ఫ్రాంచైజీ జట్టు కొత్త కెప్టెన్‌ను ప్రకటించింది. అయ్యర్ గత సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా కొనసాగాడు. అతని కెప్టెన్సీలో కేకేఆర్ టైటిల్‌ను గెలిచింది. జెడ్డా వేదికగా ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో పంజాబ్ కింగ్స్‌ను పంజాబ్ రూ.26.75కోట్లు పోసి కొనుగోలు చేసింది. ఈ ఏడాది జరుగనున్న ఐపీఎల్‌లో పంజాబ్ అయ్యర్ కెప్టెన్సీలో బరిలోకి దిగనున్నది. పంజాబ్ కింగ్స్ 2008 నుంచి ఐపీఎల్‌లో కొనసాగుతున్నది. 2020 వరకు ఆ జట్టుకు కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ పేరు ఉండేది. పంజాబ్ వరుసగా 17 సీజన్లలో పాల్గొనగా.. మొత్తం 16 మంది కెప్టెన్లుగా పని చేశారు. శ్రేయాస్ అయ్యర్ 17వ కెప్టెన్‌గా పనిచేయనున్నాడు. యువరాజ్ సింగ్ పంజాబ్ కింగ్స్‌కు తొలి కెప్టెన్. ఆస్ట్రేలియాకు చెందిన జార్జ్ బెయిలీ అత్యధికంగా 35 మ్యాచుల్లో జట్టుకు నాయకత్వం వహించాడు. మహేల జయవర్ధనే, వీరేంద్ర సెహ్వాగ్, జితేష్ శర్మ కెప్టెన్లుగా పని చేశారు.



## స్పోర్ట్స్

## చాంపియన్స్ ట్రోఫీకి ఆస్ట్రేలియా జట్టు ప్రకటన.. కెప్టెన్‌గా కమ్మిన్స్..




ఈ ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి క్రికెట్ ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు కెప్టెన్‌గా పాట్ కమ్మిన్స్‌కు బాధ్యతలు అప్పగించింది. ఇటీవల టెస్టుల్లో గాయపడిన ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్‌కు సైతం జట్టులో చోటు కల్పించింది. ఓపెనర్ జేక్ ఫ్రేజర్, మెక్‌గర్క్‌కు సైతం జట్టులో చోటు దక్కింది. పాక్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో పేలవమైన ఫామ్‌తో జాతీయ జట్టుకు దూరం కాగా.. మళ్లీ చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసింది. క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించిన జట్టులో ఆల్‌రౌండర్లు, ఫాస్ట్ బౌలర్లతో పాటు స్టార్ బ్యాటర్స్‌తో జట్టు పటిష్టంగా కనిపిస్తున్నది. ఈ సందర్భంగా ఆసిస్ చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిల్ మాట్లాడుతూ.. వన్డే ప్రపంచకప్, వెస్టిండ్ సిరీస్, ఇంగ్లాండ్ పర్యటనలో విజయవంతమైన జట్టు ఇదని తెలిపారు. పాకిస్థాన్ సిరీస్‌లోనూ విజయవంతమైన ఆటగాళ్లతో కూడిన సమతుల్య, అనుభవజ్ఞులైన జట్టని.. పాక్‌లోని పరిస్థితులకు అనుగుణంగా బెస్ట్ టీమ్‌ని ఎంపిక చేశామన్నారు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి మొదలుకానున్నది. పాకిస్థాన్‌తో పాటు దుబాయి వేదికగా జరుగనున్నది. టీమిండియా మ్యాచులు దుబాయిలో జరుగుతాయి. ఇక చాంపియన్స్ ట్రోఫీకి ఇటీవల ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ జట్లను ప్రకటించారు. ఈ ఈవెంట్‌లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటాయి. ఎనిమిది జట్లను రెండేసి గ్రూపులుగా విభజించారు.

ఆస్ట్రేలియా జట్టు ఇదే..

పాట్ కమ్మిన్స్ (కెప్టెన్), అలెక్స్ క్యారీ (వికెట్ కీపర్), నాథన్ ఎల్లిస్, ఆరోన్ హార్డీ, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లబుషేన్, మిచెల్ మార్ష్, గ్లెన్ మాక్స్‌వెల్, మాట్ షార్ట్, స్టీవ్ స్మిత్, ఆడమ్ జంపా, మార్కస్ స్టొయినిస్, మిచెల్ స్టార్క్.

### బాక్సాఫీస్‌ను షేకాడిస్తున్న డాకు మహారాజ్..

# తొలిరోజే కలెక్షన్ల ఊచకోత!




నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా నటించిన హై వోల్టేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డాకు మహారాజ్ సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైన సంగతి తెలిసిందే. మాస్ మువీలకు కేరాఫ్ అడ్రస్‌గా పేరుగాంచిన యువ డైరెక్టర్ బాబీ కొల్లి, బాలయ్య కాంబినేషన్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ మువీ తొలి రోజు నుంచే బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది. మరోవైపు పాజిటివ్ రివ్యూలు, మౌత్ టాక్‌తో బాలకృష్ణ సాలీడ్ ఓపెనింగ్స్ మంచి బజ్ క్రియేట్ చేసింది. బాలయ్య వన్ మ్యాన్ షో అంటూ ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. ఈ మూవీ ఫస్ట్ డే బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. డాకు మహరాజ్ ప్రపంచ వ్యాప్తంగా తొలి రోజు ఏకంగా రూ.56 కోట్లు వసూలు చేసింది. ఇక ఈ రోజు ఆదివారం, పైగా పండగా కూడా.. దీంతో థియేటర్లన్నీ కిటకిటలాడిపోతున్నాయి. గాడ్ ఆఫ్ మాసెస్ బాలయ్య దూకుడుకు బాక్సాఫీస్ కలెక్షన్ తో పాటు అన్నిచోట్ల థియేటర్ ఫుల్ ఆక్యుపెన్సీ కూడా నమోదు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ రోజు కూడా బ్లాక్‌బస్టర్ జోరును కొనసాగిస్తోంది. యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ మువీ సంక్రాంతి సెలవుల్లో బాక్సాఫీస్‌ను మరింత కొల్లగొట్టే అవకాశం ఉన్నట్లు ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు. కాగా అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి వంటి వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టి మాంచి ఊపులో ఉన్న బాలయ్య.. ఇప్పుడు మరో విజయాన్ని తన ఖాతాలో జమ చేసుకున్నాడు. సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు భారీ బడ్జెట్‌తో డాక్ మహరాజ్ మువీని నిర్మించారు. ఇందులో బాలకృష్ణ సరసన ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటించగా శ్రద్ధా శ్రీనాథ్ , చాందినీ చౌదరి, ఊర్వశి రౌతేలా, సచిన్ ఖేడేకర్, హర్షవర్ధన్, హిమజ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఇక బాలీవుడ్ స్టార్ యాక్టర్ బాబీ డియోల్ ప్రతినాయకుడు (విలన్) పాత్రలో అలరించారు. పాటల మాంత్రికులు థమన్ స్వరాలు సమకూర్చారు. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రహణం, రూబెన్ %-% నిరంజన్ దేవరమానే ఎడిటింగ్ అందించారు.

### చేసినా సినిమాలన్నీ యావరేజ్..

# ఒక్క సినిమాతో పాన్ ఇండియాను షేక్ చేసింది



సెలబ్రెటీ ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీలోకి నటిగా అడుగుపెట్టింది. ప్రస్తుతం ఇండస్ట్రీలో భారీ రెమ్యునరేషన్ తీసుకుంటున్న బ్యూటీస్ లో ఆ అమ్మడు ఒకరు. చిన్నవయసులోనే కోట్ల రూపాయిలను సంపాదించింది. అలాగే సోషల్ మీడియాలో నిత్యం గ్లామర్ ఫోటోస్ షేర్ చేస్తూ నెటిజన్స్ మతిపోగొట్టేస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ వయసు 27 సంవత్సరాలు. కానీ కోట్ల కొద్దీ ఆస్తిపాస్తులు కూడబెట్టింది. చాలా కాలంగా హిట్స్ లేక సతమతం అయిన ఈ వయ్యారి గతేడాగి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ హిట్ ఖాతాలో వేసుకుంది. దీంతో ఈ బ్యూటీ క్రేజ్ మారిపోయింది. ఒకే ఒక్క సినిమాతో ఏకంగా ఇండస్ట్రీని షేక్ చేసింది. ఇంతకు ఆ హీరోయిన్ ఎవరో తెలుసా.. ? ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్. ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్లో ఓరేంజ్ ఫాలోయింగ్ క్రియేట్ చేసుకున్న ముద్దుగుమ్మ. హిందీలో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. నటిగా అద్భుతమైన నటనకు ప్రశంసలు అందుకున్న జాన్వీకి సరైన బ్రేక్ రాలేదు. గతేడాది యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన దేవర సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సూపర్ హిట్ కావడంతో ఈ అమ్మడు క్రేజ్ ఊహించని రేంజ్ లో మారిపోయింది. దీంతో తెలుగులో మరిన్ని ఆఫర్స్ క్యూ కట్టాయి. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన డైరెక్టర్ బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న మూవీలో నటిస్తుంది. అలాగే దేవర పార్ట్ 2లో నటిస్తుంది. దేవర సినిమా తర్వాత జాన్వీ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. 27 ఏళ్ల వయసులోనే కోట్ల ఆస్తిని కూడబెట్టింది. తల్లి స్టార్ హీరోయిన్, తండ్రి బడా నిర్మాత అయినా కూడా జాన్వీ సొంతంగా సంపాదిస్తూ కోట్లు సంపాదించింది. కొన్ని రోజుల క్రితం ఓ ఖరీదైన బంగ్లాను కొనుగోలు చేసింది. అలాగే ఈ అమ్మడి దగ్గర కాస్ట్లీ కార్లు ఉన్నాయి. అలాగే సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో కుర్రాళ్లకు వెర్రెక్కిస్తుంది.

## మన్మథుడు హీరోయిన్ అన్షుపై హాట్ కామెంట్స్ దుమారం..
## డైరెక్టర్ త్రినాథరావు నక్కిన క్షమాపణలు



త్రినాథ రావు నక్కిన డైరెక్షన్‌లో సందీప్ కిషన్ హీరోగా నటిస్తోన్న చిత్రం మజాకా. రీతూవర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మన్మథుడు ఫేం అన్షు కీలక పాత్రలో నటిస్తోంది. కాగా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో త్రినాథరావు నక్కిన చేసిన కామెంట్స్ ఇండస్ట్రీ సర్కిల్‌లో తీవ్రదుమారం రేపాయి. ఈవెంట్‌లో త్రినాథ రావు నక్కిన మాట్లాడుతూ.. మన్మథుడు సినిమా తర్వాత అన్షు ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉందంటూ.. ఆమె ఫారిన్ నుంచి వచ్చాక సన్నగా ఉందని, కాదమ్మా తెలుగుకు సరిపోదు, కొంచెం అన్నీ ఎక్కువ సైజుల్లో ఉండాలని చెప్పా.. పర్లేదు ఇప్పుడు కొంచెం ఇంప్రూవ్ అయిందంటూ కామెంట్ చేశాడు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవడమే కాకుండా మహిళా కమిషన్ దృష్టికి కూడా వెళ్లింది. త్రినాథరావు వ్యాఖ్యలను సుమోటోగా సీక్వరించిన మహిళా కమిషన్ చైర్మన్ నేరేళ్ల శారద.. త్వరలోనే నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా త్రినాథరావు ఎక్స్ వేదికగా క్షమాపణలు తెలియజేస్తూ వీడియో విడుదల చేశాడు. అందరికీ నమస్కారం.. ముఖ్యంగా మహిళలకు, అన్షుకు.. నా మాటల వల్ల బాధపడ్డ ఆడవాళ్లందరికీ నా క్షమాపణలు తెలియజేసుకుంటున్నాను, నా ఉద్దేశ్యం ఎవరిని బాధ కలిగించడం కాదు తెలిసి చేసినా తెలియకుండా చేసిన తప్పు తప్పే మీరందరూ పెద్ద మనసు చేసుకొని నన్ను క్షమిస్తారని కోరుకుంటున్నానన్నారు.

## అజిత్ కుమార్ విదాముయార్చి ట్రైలర్ అనౌన్స్‌మెంట్ టైం ఫిక్స్!

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. వీటిలో ఒకటి మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్న విదాముయార్చి ఒకటి. ఏకే 62గా వస్తోన్న ఈ చిత్రంలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా అభిమానులు, మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ట్రైలర్ అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ ట్రైలర్‌ను ఎప్పుడు లాంచ్ చేయబోతున్నారనే దానిపై రేపు క్లారిటీ ఇవ్వనున్నారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ మూవీలో యాక్షన్ కింగ్ అర్జున్ సార్జా కీలక పాత్ర పోషిస్తుండగా.. రెజీనా కసాండ్రా మరో కీ రోల్‌లో నటిస్తోంది. ఆరవ్ కీ మరో ముఖ్య పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే విదాముయార్చి నుంచి షేర్ చేసిన పోస్టర్లు నెట్టింట చక్కర్లు కొడుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రంలో అజిత్ కుమార్ మరోవైపు అధిక్ రవిచంద్రన్ డైరెక్షన్‌లో ఏకే 63 కూడా చేస్తున్నాడు. గుడ్ బ్యాడ్ అగ్లీ టైటిల్‌తో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఈ మూవీని జనవరి 31న కానీ లేదా ఫిబ్రవరి 7న కానీ విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు హల్ చల్ చేస్తుండగా.. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com